Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 1 | సంచిక : 303 | మేడ్చల్ మల్కాజ్‌గిరి | 21 నవంబర్ 2023 | మంగళవారం | పేజీలు : 4

### రాజుల కోటలో ఉచితాల జల్లు

ధనిక రాష్ట్రం.. ఎడారి ప్రాంతం.. పలు రాజవంశాలకు నిలయమైన రాజస్థాన్‌లో ప్రధాన పార్టీలైన బీజేపీ, కాంగ్రెస్‌లు ఓటర్లపై ఉచిత హామీల వర్షం కురిపిస్తున్నాయి. మహిళలు, యువత, విద్యార్థులను ఆకట్టుకునేందుకు తక్కువ ధరకే వంట గ్యాస్ సిలిండర్, బాలికలకు నగదు సాయం నుంచి స్కూటీల వరకు అనేక వాగ్దానాలు చేస్తున్నాయి. ప్రధాన వర్గాలను సంతృప్తిపరిచే ప్రయత్నం చేస్తు న్నాయి. అరచేతిలో వైకుంఠం చూపుతున్నాయు. వీటి అమలు గురించి అడిగినా.. నిధులు ఎలా వస్తాయన్నా.. దాటవేస్తున్నాయి. సంపద పెంచి ప్రజలకు పంచుతామని చెబుతున్నాయి. రాష్ట్ర అసెంబ్లీలోని 200 స్థానాలకు ఈ నెల 25న ఒకేసారి పోలింగ్ జరగనుంది. డిసెంబరు 3న మధ్యప్రదేశ్, ఛత్తీసగఢ్, మిజోరాం, తెలంగాణ అసెంబ్లీలతో పాటే ఓట్ల లెక్కింపు జరుగుతుంది. రెండు వారాలపాటు అభ్యర్థుల ఎంపిక, ఖరారుతో సతమతమైన రెండు పార్టీలు.. ఇప్పుడు హామీలతో హోరెత్తిస్తున్నాయి.

# దొరల రాజ్యం పోవాలె ఇందిరమ్మ రాజ్యం తేవాలె



## పరకాల విజయభేరి సభలో రేవంత్‌రెడ్డి

వరంగల్: దొరల రాజ్యాన్ని బొందపెట్టి ఇందిరమ్మ రాజ్యం తేవాలని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి అన్నారు. సోమవారం నాడు పరకాల విజయభేరి సభలో రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ..“కొండా దంపతులు పరకాల నుంచి వెళ్లాక కాంగ్రెస్ పార్టీ శ్రేణులపై అక్రమ కేసులు పెట్టారు. ఇన్నేళ్లు బీఆర్ఎస్ ఎమ్మెల్యే అణచివేతను తట్టుకున్నారు. కడుపులో పెట్టుకొని కాపాడే రేవూరి మీకోసం వచ్చాడు. నిండు చెరువులా సభకు జనం కదిలివచ్చారు. సాయుధ రైతాంగ పోరాటానికి పరకాల ఫిరంగిలా మారింది. తెలంగాణ ఉద్యమాన్ని పరకాల ఉవ్వెత్తున ఎగిసేలా చేసింది. తెలంగాణ సిద్ధాంత కర్త ప్రొఫెసర్ జయశంకర్ సార్ జన్మస్థలం కూడా పరకాలనే. ప్రత్యేక నిధులు ఇచ్చి పరకాలను అభివృద్ధి చేస్తాం. కేసీఆర్ మాటలు చూస్తే మందేసి, మతి తప్పి మాట్లాడినట్లు ఉంది. ఇందిరమ్మ రాజ్యం అంటే బీఆర్ఎస్ నేతలు హేళన చేస్తున్నారు. దొరల రాజ్యం కావాలా, ఇందిరమ్మ రాజ్యం కావాలా తేల్చుకోండి. ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చాం, భూమిలేని పేదలకు భూపంపిణీ చేశాం. బడి, గుడి, నీళ్లు ఇచ్చింది ఇందిరమ్మ రాజ్యమే. ‘దొర ఏందిరో’ అని పిడికిలి ఎత్తింది ఇందిరమ్మ రాజ్యం. ఎస్సీ, ఎస్టీలు పదవులు అనుభవించేలా ఇందిరమ్మ రాజ్యం చేసింది. తెలంగాణ ప్రజల ఆకాంక్ష అయిన తెలంగాణను ఇందిరమ్మ రాజ్యం ఇచ్చింది” అని రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు.

**కేసీఆర్‌ను ఇక ఇంటికి తోలుడే :** మెదక్: ముఖ్యమంత్రి కేసీఆర్‌కు రాజకీయ భిక్ష పెట్టింది కాంగ్రెస్ పార్టీనేనని పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. నర్సాపూర్‌లో జరిగిన ఎన్నికల ప్రచారంలో రేవంత్ పాల్గొని కేసీఆర్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సోనియాగాంధీ తెలంగాణ ఇవ్వకపోతే నాంపల్లి దగ్గరలోనో.. బిర్లా మందిర్ దగ్గరో కేసీఆర్ కుటుంబం బిచ్చ మెత్తుకునే వారని విమర్శించారు. కేసీఆర్ మోడల్ అంటే కుంగిపోయే బ్యారేజ్‌లా అంటూ ప్రశ్నించారు. పదేళ్లు ఏం చేశారో చెప్పకుండా కాంగ్రెస్ పార్టీని తిడుతున్నారని మండిపడ్డారు. తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్‌ను తిడితే ఉసురు తగులుతుందని వ్యాఖ్యానించారు. తెలంగాణలో అరాచక రాజ్యమేలుతోందని.. కేసీఆర్‌ను ఇంటికి పంపించే సమయం ఆసన్నమైందని చెప్పుకొచ్చారు. బీఆర్ఎస్‌ను ఎన్నికల్లో వంద కిలో మీటర్ల లోపల పాతిపెట్టాలని ప్రజలకు పిలుపునిచ్చారు. “కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఆరు గ్యారంటీలను కచ్చితంగా అమలు చేస్తాం. కాంగ్రెస్ వస్తే రైతుబంధు బంద్ కాదు.. ఎకరాకు రూ.15 వేలు ఇస్తాం. కౌలు రైతులకు, భూమి లేని నిరుపేదలకు కూడా రూ.15 వేలు ఇస్తాం. 50 ఏళ్లు స్నేహం చేసిన మదన్‌రెడ్డిని మోసం చేసి టికెట్ వేరొకరికి ఇచ్చిన కేసీఆర్‌కు ప్రజలు ఓ లెక్కా. బీఆర్ఎస్ పాలనలో బంగారు తెలంగాణ కాలేదు. బొందల గడ్డ తెలంగాణగా మార్చారు. బెల్ట్ షాపుల్లో తెలంగాణను మొదటి స్థానంలో నిలిపారు. పార్టీ మారిన నేతలను అసెంబ్లీ గేట్ దాటనివ్వొద్దు. దళితులకు భూములు పంపిణి చేసిన పార్టీ కాంగ్రెస్. నాగార్జున సాగర్ సహా పలు ప్రాజెక్టులు కట్టి రాష్ట్రంలో 70 లక్షల ఎకరాలకు కాంగ్రెస్ సాగు నీరు ఇచ్చింది. స్థానిక సంస్థల్లో మహిళా రిజర్వేషన్ల కోసం చట్టం చేసింది కూడా కాంగ్రెస్ ప్రభుత్వమే.” నని రేవంత్ వెల్లడించారు.




జనగామ: బీజేపీని గెలిపిస్తే ఉచితంగా అయోధ్య యాత్ర చూపిస్తామని కేంద్ర హోంమంత్రి అమిత్ షా హామీ ఇచ్చారు. జనగామలో జరిగిన ఎన్నికల ప్రచారంలో అమిత్ షా పాల్గొని ప్రసంగించారు. “అయోధ్య రామ మందిరం జనవరిలో ప్రాణ ప్రతిష్ట చేయబోతున్నారు. బీజేపీని గెలిపిస్తే ఉచితంగా అయోధ్య యాత్ర చేపిస్తాం. తెలంగాణలో బీజేపీ వస్తే అవినీతికి పాల్పడిన అందరినీ జైలుకు పంపుతాం. పార్లమెంట్ నిర్మించిన మోదీ దేశ గర్వాన్ని పెంచిన నాయకుడు. ప్రధాని మోదీ కృషితో చంద్రయాన్ ముద్దాడిన ఘనత మనది. మిషన్ కాకతీయ అంటేనే కమీషన్. 4 శాతం ముస్లిం రిజర్వేషన్ తీసేసి ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లు పెంచుతాం. 2024లో మరోసారి మోదీని ప్రధానిని చేద్దాం.” అని ప్రజలకు అమిత్ షా పిలుపునిచ్చారు.

## ఎన్నికలప్రక్రియకు వేగం పెంచిన ఎలక్షన్ కమిషన్

### బ్యాలెట్, పోస్టల్ బ్యాలెట్ ముద్రణ షురూ

హైదరాబాద్: తెలంగాణ ఎన్నికలకు సమయం దగ్గరపడుతోంది. ఈనెల 30న తెలంగాణ ఎన్నికలు, డిసెంబర్ 3న ఫలితాలు వెల్లడికానున్నాయి. ఈ నేపథ్యంలో పోలింగ్ – కౌంటింగ్‌కు ఎలక్షన్ కమిషన్ సిద్ధమవుతోంది. 14 లక్షల 40వేల బ్యాలెట్ పేపర్, 25 వేల పోస్టల్ బ్యాలెట్ ముద్రణ ప్రారంభమైంది. 26 వరకు హోం ఓటింగ్, ఫెసిలిటేషన్ సెంట్రల్ ముగించాలని ప్రణాళికలు రూపొందించారు. కొత్త ఓటర్లు పెరగడంతో అదనంగా 299 పోలింగ్ కేంద్రాలు పెరిగాయి. ఈసారి జరిగే కౌంటింగ్ కేంద్రాలను సెంట్రల్ ఎలక్షన్ కమిషన్ పెంచింది. రాష్ట్ర వ్యాప్తంగా 35 వేలకు పైగా పోలింగ్ కేంద్రాలను ఎలక్షన్ కమిషన్ ఏర్పాటు చేస్తోంది. లా అండ్ ఆర్డర్ విషయంలో సెంట్రల్ ఎలక్షన్ కమిషన్ పకడ్బందీ ఏర్పాట్లు చేస్తోంది.

రాష్ట్రానికి 375 కేంద్ర కంపెనీల నుంచి 40 వేల వరకు సెంట్రల్ ఫోర్సెస్ రానున్నాయి. ఆయా రాజకీయ పార్టీలు ప్రచారంలో జోరు పెంచాయి. ఎమ్‌సీసీ వాయిలేషన్ కాకుండా స్పెషల్ అబ్జర్వర్ల నియామకం జరిగింది. సీఈసీ నిబంధనలు అతిక్రమిస్తే ఎవ్వరైనా ఉపేక్షించేది లేదని ఈసీఐ హెచ్చరించింది.

**సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి :** సమస్యాత్మక ప్రాంతాలపై ఎలక్షన్ కమిషన్ ప్రత్యేక దృష్టి పెట్టింది. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 35 వేలకు పైగా పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసింది.



రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 9వేలకు పైగా సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను ఎలక్షన్ కమిషన్ గుర్తించింది. గ్రేటర్ హదరాబాద్‌లో 18 వందల సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. సమస్యాత్మక ప్రాంతాల్లో మూడంచెల భద్రత, అత్యంత సమస్యాత్మక ప్రాంతాల్లో ఐదు అంచెల భద్రత కల్పించనున్నారు. 5వందలకు పైగా మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో పోలింగ్ స్టేషన్లు ఉండటంతో.. క్రిటికల్ పోలింగ్ కేంద్రాల వద్ద సెంట్రల్ ఫోర్సెస్‌తో పహారా నిర్వహించనున్నారు.



# ప్రతి ఒక్క హామీని నెరవేరుస్తాం

## 100 శాతం రుణమాఫీ చేస్తాం : సీఎం కేసీఆర్

స్టేషన్ ఘన్‌పూర్ : మిగిలిన నాలుగైదు శాతం మంది రైతులకు 100 శాతం రుణమాఫీ చేస్తామని ముఖ్యమంత్రి కేసీఆర్ హామీ ఇచ్చారు. స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ ప్రజా ఆశీర్వాద సభలో కేసీఆర్ పాల్గొని కడియం శ్రీహరికి మద్దతుగా ప్రసంగించారు. కాంగ్రెస్ నాయకులు మాట్లాడితే కొన్ని విషయాల్లో సిగ్గుండాలి. రైతురుణమాఫీ చేస్తామని రెండు సార్లు చెప్పాం. బాజాప్తా చేసినం. అందులో కరోనా రావడం వల్ల ఒక సంవత్సరం ఆదాయం సున్నా అయింది. రూపాయి కూడా రాలేదు. దాని వల్ల లేట్ అయింది. లేదంటే ఎప్పుడ అయిపోవు రైతు రుణమాఫీ. రుణమాఫీ మూడేండ్ల కిందనే అయిపోవాలి. కరోనా కొట్టిన దెబ్బకు రాష్ట్ర ప్రభుత్వ ఆదాయం పడిపోయి ఆలస్యమైంది. మొన్న చేసినం. 90 శాతం అయిపోయింది రుణమాఫీ. ఏనుగు వెళ్లింది తోక చిక్కింది. లక్ష వరకు అందరికీ అయిపోయింది. ఆ పైన ఉన్నోళ్లకు ఓ నాలుగైదు శాతం మందికి మిగిలింది. అది ఇయ్యమా మేం. దాన్ని కూడా ఇష్యూ చేశారు కాంగ్రెసోళ్లు. అడ్డు పడ్డది కూడా కాంగ్రెసోడే. ఎలక్షన్ కమిషన్‌కు ఫిర్యాదు చేసి ఇప్పుడు ఇవ్వొద్దని ఫిర్యాదు చేసిండు. మళ్లా బజార్లకు వచ్చి రుణమాఫీ కాలేదని మాట్లాడుతున్నరు. సిగ్గు కూడా ఉండాలి. మిగిలిన వాళ్లకు కూడా 100 శాతం ఇమిడియట్‌గా ఇచ్చేస్తాం. దాని గురించి అసలు ఆలోచించే అవసరం లేదు రైతులు. మంచేదో, చెడు ఏందో నిర్ణయించాలి.. ఆలోచించి ఓటేయాలని కేసీఆర్ కోరారు.

**ఎలక్షన్ తెల్లారే ఆర్టీసీ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేస్తాం : సీఎం కేసీఆర్** – టీఎస్ ఆర్టీసీ ఉద్యోగులకు ముఖ్యమంత్రి కేసీఆర్ శుభవార్త వినిపించారు. ఎలక్షన్ తెల్లారే ఆర్టీసీ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేస్తామని సీఎం కేసీఆర్ హామీ ఇచ్చారు. స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ ప్రజా ఆశీర్వాద సభలో కేసీఆర్ పాల్గొని కడియం శ్రీహరికి మద్దతుగా ప్రసంగించారు.

ఆర్టీసీ బిడ్డలు ఉన్నారు. వాళ్లది పాపం ఎప్పుడు ఉద్యోగం పోతదో తెల్వదు. ఒక అభద్రతా భావం. ఆర్టీసీ బిల్లు పాస్ చేసినం. అది గవర్నర్ ఆలస్యం చేయడం వల్ల అది కొంత ఆలస్యమైంది. ఎలక్షన్ తెల్లారే ఆర్టీసీ బిడ్డలను రెగ్యులరైజ్ చేసి గవర్నమెంట్ ఉద్యోగస్తులుగా చేస్తాం అని కేసీఆర్ ప్రకటించారు.

**ఆటో రిక్షా కార్మికులకు ఫిట్‌నెస్ ట్యాక్స్ రద్దు** – మన వద్ద లక్షల మంది ఆటో రిక్షా బిడ్డలు ఉన్నారు. ఇండియా మొత్తంలో ఆటో రిక్షాలకు ట్యాక్స్ ఉంది. ఒక్క తెలంగాణ రాష్ట్రంలో లేదు. వారు పేదవాళ్లు బతుకుతున్నారని ట్యాక్స్ మినహాయింపు ఇచ్చాం.

వాళ్లకు ఇంకో సమస్య ఉంది. ఏందంటే ఫిట్‌నెస్ కోసం పోతే ఏడాదికి రూ. 1200 కట్టాల్సి వస్తుంది. అది కూడా ఎలక్షన్ తెల్లారి రద్దు చేస్తామని చెబుతున్నా. ఆటో రిక్షా కార్మికులకు కూడా ఫిట్‌నెస్ ట్యాక్స్, పర్మిట్ ట్యాక్స్ రద్దు చేస్తాం. జీరో చేస్తాం. ప్రభుత్వానికి రూ. 100 కోట్ల నష్టం వస్తది అయినా పర్వాలేదు. వాళ్లు పేదవాళు ఐదారు లక్షల మంది ఆటో నడిపి బతికేవారు ఉన్నారు. వాళ్ల సంక్షేమం కోసం అది కూడా చేస్తామని కరీంనగర్‌లో ప్రకటన చేశాను. ఆ విధంగా ఆటో కార్మికులను ఆదుకుంటాం. అలా ప్రతి వర్గాన్ని ఆదుకుంటూ ముందుకు పోతున్నాం కేసీఆర్ తెలిపారు.

# సంపాదకీయం

## పుతిన్ ని వ్యతిరేకిస్తే పరలోకమేనా?

ప్రస్తుతం రష్యాలో ఈ తరహా చర్చ ఒకటి మొదలైంది. వ్లాదిమీర్ పుతిన్ చేసిన, చేస్తున్న పనుల్లో.. తీసుకుంటున్న, తీసుకున్న నిర్ణయాల్లో ఎవరైనా లోపాలు ఎత్తిచూపితే.. వారు పైలోకాలకు పోవాల్సిందేనా అనే చర్చ బలంగా సాగుతుందని తెలుస్తుంది. కారణం... ఇటీవల విమాన ప్రమాదంలో ప్రిగోజిన్ మరణించడం, ఆ సమయంలో పుతిన్ కి సంబంధించినది చెప్పిన "నమ్మక ద్రోహం" వీడియో వైరల్ అయిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో మాజీ అధికారి ఒకరు అనుమానాస్పదంగా మృతిచెందారు! అవును... పుతిన్ తో పెట్టుకుంటే పైలోకాలకే అనే చర్చ ఇప్పుడు రష్యాలో మొదలైందని అంటున్నారు. దీనికి కారణం పుతిన్ పై విమర్శలు చేసినా, తిరుగుబాటు చేసిన వ్యక్తులు అనుమానాస్పదంగా మృతి చెందడమే. ఈ క్రమంలో తాజాగా ఎయిర్ కమాండర్ ఒకరు కూడా అదే రీతిలో చనిపోయారు. ఆయన నివాసంలో మృతదేహమై కనిపించారు. పుతిన్ పై విమర్శలు చేసిన అనంతరం ఇది జరిగిందని అంటున్నారు! గతంలో రష్యా వాయుసేనలో పనిచేసిన వ్లాదిమిర్ స్విరిదోవ్ అనే అధికారి.. స్టావ్రోపోల్ లోని ఆయన నివాసంలో విగతజీవిగా కనిపించారు. ఆయన పక్కనే భార్య మృతదేహం కూడా ఉన్నట్లు స్థానిక పోలీసులు వెల్లడించారని అంటున్నారు. అయితే... వీరిద్దరి మరణాలకు గల కారణాలు మాత్రం పోలీసులు వెల్లడించలేదు! ఇంకా తెలియరాలేదు అని చెబుతున్నారు! అయితే... స్థానికంగా సోషల్ మీడియా వేదికగా మాత్రం వీరి హత్యకు గల కారణాలపై చర్చ మొదలైందని తెలుస్తుంది! 2005-2009 మధ్యకాలంలో ఎయిర్ డిఫెన్స్ ఫోర్సెస్ లో కమాండర్ గా పనిచేసిన వ్లాదిమిర్ స్విరిదోవ్.. ఎయిర్ ఫోర్స్ లో ప్రమాణాల విషయంలో పుతిన్ పై గతంలో విమర్శలు గుప్పించారు. ఇదే సమయంలో ఇటీవల మరోసారి సైన్యంలో పైలట్లకు తగిన శిక్షణ అందడం లేదని, వారికి ఇచ్చే వేతనాలు, అక్కడి పరిస్థితులు దారుణంగా ఉన్నాయని విమర్శించారు. ఇందులో భాగంగా... యుద్ధానికి సిద్ధంగా ఉండే ఒక పైలట్ ఏడాదికి 100 గంటలు పాటు విమానాన్ని నడిపి ఉండాలని.. కానీ, ప్రస్తుతం అలా ఉండటం లేదని.. ప్రస్తుత 25-30 గంటలు మాత్రమే పైలట్ విమానం నడుపుతున్నారని వ్లాదిమిర్ స్విరిదోవ్ ఓ ఇంటర్వ్యూలో ఆరోపించారు. దీని కారణంగానే థర్డ్ ర్యాంకింగ్ పైలట్లను మిలటరీ అకాడమీలకు పంపించాల్సి వస్తుంది.. గతంలో ఎన్నడూ ఇటువంటి పరిస్థితి లేదని విమర్శించారు. కాగా... ఈ ఏడాది ఆగస్టు లో రష్యా వాగ్నర్ గ్రూప్ చీఫ్ ప్రిగోజిన్.. విమాన ప్రమాదంలో మృతి చెందిన సంగతి తెలిసిందే. ఆ సమయంలో... ప్రిగోజిన్ ది ప్రమాదం కాదని, అతడిని హత్య చేశారని అమెరికా ఇంటెలిజెన్స్ అంచనా వేసింది. దీంతో నాడు రష్యా సైనిక నాయకత్వం పై తిరుగుబాటు చేసిన సరిగ్గా అరవై రోజులకు ఎవరూ ఊహించని విధంగా ప్రిగోజిన్ విమాన ప్రమాదంలో మృతి చెందడం తీవ్ర చర్చనీయాంశమైంది. జూన్ 23వ తేదీన రష్యా సైనిక నాయకత్వంపై ప్రిగోజిన్ తిరుగుబాటు ప్రకటించాడు. ఆ తర్వాత కొన్ని గంటల్లోనే దానిని ఉపసంహరించుకొని రష్యా అధ్యక్షుడు పుతిన్ తో రాజీపడ్డారు. ఈ ఘటనకు సరిగ్గా రెండు నెలలు పూర్తయిన (ఆగస్టు 23న) సమయంలో ప్రిగోజిన్ విమానం కూలి మరణించారు. దీంతో పుతిన్ ని వ్యతిరేకిస్తే పరలోకమేనా అనే చర్చ బలంగా మొదలైంది! ఇక ప్రిగోజిన్ కంటే ముందు ఉక్రెయిన్ లో రష్యా సైనిక చర్యను విమర్శించిన రష్యా అతిపెద్ద ప్రైవేట్ ఆయిల్ కంపెనీ బోర్డు ఛైర్మన్ ఆసుపత్రి కిటికీలోంచి పడిపోయి మరణించాడు. ఇదే సమయంలో... రష్యా శాసనసభ్యుడు పావెల్ ఆంటోవ్ ఓ హోటల్ పై నుంచి పడి మరణించాడు. అదేవిధంగా... గతేడాది ఉక్రెయిన్ తో యుద్ధం మొదలైనప్పటినుంచీ రష్యాకు చెందిన సుమారు 19 మంది పలువురు ప్రముఖులు, వ్యాపారవేత్తలు ప్రాణాలు కోల్పోయినట్లు గణాంకాలు చెబుతున్నాయి!

# జిల్లాలో ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే సీ విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదు చేయాలి

### సీ విజిల్ యాప్లో ఫిర్యాదులపై వంద నిమిషాల్లో తక్షణ చర్యలు

### మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్



జిల్లా బ్యూరో మేడ్చల్ మల్కాజ్గిరి: జిల్లాలో శాసనసభ ఎన్నికలకు సంబంధించి ఎన్నికల ప్రవర్తన నియమావళిని ఉల్లంఘించినట్లయితే ప్రజలు ఎన్నికల కమిషన్ ప్రత్యేకంగా రూపొందించిన సీ విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదు చేయాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ తెలిపారు. సీ విజిల్ యాప్ ద్వారా వచ్చే ఫిర్యాదులో ఫిర్యాదుదారు ఫోన్ నెంబర్, వివరాలు లేకుండా ఫిర్యాదు చేయవచ్చన్నారు. ఎన్నికల సమయంలో డబ్బు, బహుమతులు, మద్యం పంపిణీ, అనుమతి లేకుండా ప్రైవేటు ఆస్తులపై పోస్టర్లు, ప్రచారం, ఓటర్లకు బెదిరింపులు, రాత్రి పది గంటల తర్వాత ప్రచారం తదితర వాటిపై సీ- విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చున్నారు. యువత ఓటు తప్పనిసరిగా వేయాలని, ఓటు వేసే సామాజిక బాధ్యతను ఎప్పటికి మరువకూడదని పేర్కొన్నారు. సీ- విజల్ యాప్ ద్వారా వచ్చే ఫిర్యాదులకు 100 నిమిషాలలో చర్యలు తీసుకోవడం జరుగుతుందని, ఎన్నికలలో విద్వేష ప్రసంగాలు, ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘన, అక్రమ డబ్బు, మద్యం పంపిణీ, ఇతర ఉల్లంఘనలపై సీ-విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చని, ఫిర్యాదుదారుని ఫోన్ నెంబర్, వివరాలు గోప్యంగా ఉంటాయని ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ స్పష్టం చేశారు. ఎన్నికల సమయంలో ఓటర్లను మభ్యపెట్టేందుకు ఎవరైనా అక్రమంగా నగదు, మద్యం, ఇతర వస్తువులను పంపిణీ చేయడం, ఎన్నికల ప్రవర్తన నియమావళిని ఉల్లంఘించినట్లయితే వాటిని లైవ్ ఫొటోలు, లైవ్ వీడియోలు తీసి సీ - విజిల్ యాప్ ద్వారా పంపాలని తెలిపారు. ప్రజలు, ఓటర్లు సీ-విజిల్ యాప్ ద్వారా అందిన ఫిర్యాదులపై వంద నిమిషాలలో సంబంధిత అధికారులు చర్యలు తీసుకుంటారని, లైవ్ ఫోటోలు, వీడియోలను తీసేటప్పుడు, అప్లోడ్ చేసే సమయంలో జీపీఎస్ ఆన్లో ఉంచాలని... జియోగ్రాఫిక్ ఇన్ఫర్మేషన్ ద్వారా ఆటోమేటిక్గా లోకేషన్ నమోదవుతుందని సభలు, సమావేశాల్లో విద్వేషపూరిత ప్రసంగాలు చేసినా పార్టీ అభ్యర్థులు పంచే డబ్బులు, మద్యం, బహుమతులు లాంటి వివరాలను, అనుమతి లేకుండా ర్యాలీలు నిర్వహించినా, ఇతర ఎన్నికల ఉల్లంఘనలపై లైవ్ ఫొటోలు, వీడియోలు సీ - విజిల్ యాప్ ద్వారా పంపాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ తెలిపారు. జిల్లాలోని యువత సీ - విజిల్ యాప్ను ఉపయోగించి ఎన్నికల్లో జరిగే అక్రమాలను, ఉల్లంఘన లను తమ దృష్టికి తీసుకుని రావాలని, 24 గంటలు జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలోని సమీకృత జిల్లా ఫిర్యాదుల పర్యవేక్షణ కేంద్రం నుండి సీ - విజిల్ యాప్ ఫిర్యాదులపై పర్యవేక్షణ చేయడం జరుగుతుందన్నారు. సి-విజిల్ యాప్ను తమ ఫోన్లలో ప్లే-స్టోర్ నుంచి డౌన్లోడ్ చేసుకొని తమ చుట్టుపక్కల జరుగుతున్న ఎన్నికల కోడ్ ఉల్లంఘనలను అప్లోడ్ చేయాలని, సంబంధిత అధికారులు వెంటనే పరిశీలించి, వంద నిమిషాలలో చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ వివరించారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు సీ- విజిల్ యాప్ ద్వారా 243కేసులు నమోదు కాగా వాటిని ఎప్పటికప్పుడు సంబంధిత అధికారులు పరిష్కరించడం జరుగుతుందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ తెలిపారు.

# జీవించే హక్కు, రక్షణ పొందే హక్కులను బాలలందరూ పొందేలా ప్రతి ఒక్కరు కృషి చేయాలి

### తెలంగాణ రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యురాలు రాగ జ్యోతి



శామీర్ పేట (గరుడ వార్త) : బాలలకు కల్పించిన హక్కులను పరిపూర్ణంగా బాలలు పొందేలా ప్రతి ఒక్కరు కృషి చేయాలని తెలంగాణ రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యురాలు రాగ జ్యోతి అన్నారు. సోమవారం అంతర్జాతీయ బాలల హక్కుల దినోత్సవం పురస్కరించుకొని తూముకుంట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఘనంగా అంతర్జాతీయ బాలల హక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తెలంగాణ రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యురాలు రాగ జ్యోతి హాజరయ్యారు. ఈ సందర్భంగా తాను మాట్లాడుతూ... నేటి బాలలే రేపటి పౌరులని అన్నారు. బాలల హక్కులను పరిరక్షిస్తే రేపటి భావితరాలను బాగుపరిచే పౌరులుగా తీర్చిదిద్దొచ్చని అన్నారు. బాలల హక్కులు బాలలందరికి అందేలా ప్రతి ఒక్కరు కృషి చేయాలని ప్రతిజ్ఞ చేయించారు. ముఖ్యంగా జీవించే హక్కు, రక్షణ పొందే హక్కు, అభివృద్ధి పొందే హక్కులను పిల్లలందరూ పరిపూర్ణంగా పొందేలా ప్రతిజ్ఞ చేయించారు. అదే విధంగా పిల్లలను కించపరిచేలా ఉండకుండా, వివాదాలకు గురికాకుండా రక్షించడం సమాజంలో ఉన్న ప్రతి ఒక్కరు బాధ్యత అని చెప్పారు. అదేవిధంగా ఏదైనా అవాంఛనీయ సంఘటన జరిగితే, వెంటనే పిల్లల రక్షణ కొరకు ఏర్పడిన ప్రత్యేక టోల్ ఫ్రీ నెంబర్ 1098 లేదా 112 తెలియపరచాలని సూచించారు.

ముఖ్యంగా పిల్లల పట్ల జాతి కుల,మత ,లింగ వైకల్యం మరియు భాష వివక్షత గురి కాకుండా పిల్లలందరి హక్కులను కాపాడాలని ఆమె కోరారు. ముఖ్యంగా పిల్లలు ఏదైనా మానసికంగా శారీరకంగా, లైంగిక వేధింపుల నిర్లక్ష్యానికి గురికాకుండా సురక్ష వాతావరణంలో కలిగి ఉండాలని అందరూ జాగ్రత్త వహించాలని కోరారు. కార్యక్రమంలో ఎంఈఓ వసంత, జిల్లా బాలల పరిరక్షణ అధికారి ఎండి ఇంతియాజ్ రహీం, జిల్లా బాలల పరిరక్షణ సిబ్బంది, చైల్డ్ హెల్ప్ లైన్ కోఆర్డినేటర్ కీర్తన, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

# జిల్లాలో రూ.50.96 కోట్లకు పైగా నగదు స్వాధీనం

### జిల్లా గ్రీవెన్స్ కమిటీ ద్వారా రూ.40 కోట్లకు పైగా నగదు తిరిగి అప్పగింత

### మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్



జిల్లా బ్యూరో మేడ్చల్ మల్కాజ్గిరి: రాష్ట్ర శాసనసభ ఎన్నికల నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా అనేక చోట్ల ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి విస్తృతంగా తనిఖీలు నిర్వహించడం జరుగుతుందని ఈ సందర్భంగా ఇప్పటి వరకు అధికారులు, పోలీసులు రూ. 50, 96, 86, 905 (యాభై కోట్ల తొంభై ఆరు లక్షల, ఎనభై ఆరువేల తొమ్మిది వందల ఐదు రూపాయలు) నగదును స్వాధీనం చేసుకొని అలాగే ఆబ్కారీ (ఎక్సైజ్) శాఖ ఆధ్వర్యంలో ఒక లక్ష తొంభై వేళా నాలుగు వందల ఏడు (1,90,407) లీటర్ల మద్యం స్వాధీనం చేసుకొని 979 కేసులు నమోదు 426 మందిని అరెస్ట్ చేయడం జరిగిందని... చేసినట్లు మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ తెలిపారు.

**తనిఖీల్లో స్వాధీనం చేసుకొన్న రూ. 40, 14, 75, 823 నగదు తిరిగి అప్పగింత :** ఈ మేరకు జిల్లా గ్రీవెన్స్ కమిటీ అధికారులు అన్ని రకాల ధ్రువపత్రాలు పరిశీలించి అన్ని రకాల ఆధారాలు సరిగ్గా ఉన్న కేసులకు సంబంధించి 347 కేసులకు సంబంధించి రూ. 40, 14, 75, 823 (నలభై కోట్ల పద్నాలుగు లక్షల డెబ్బై ఐదు వేల ఎనిమిదివందల ఇరవై మూడు రూపాయలు) తిరిగి అప్పగించినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినప్పటి నుంచి అధికారులు, పోలీసులు వాహనాలు, తదితరాలు తనిఖీలు చేపట్టడం, ప్రత్యేకంగా నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఎన్నికల ప్రవర్తనా నియమావళిని అనుసరించి రూ.50 వేల కంటే ఎక్కువ నగదు తీసుకెళ్ళరాదని... ఒకవేళ తీసుకువెళ్ళేట్లయితే అందుకు సరైన ధ్రువపత్రాలు కలిగి ఉండాలని లేనట్లయితే నగదును సీజ్ చేయడం జరుగుతుందన్నారు. రాష్ట్ర శాసనసభ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా ఎలాంటి అనుమతులు లేకుండా నగదు, మద్యం తరలింపుపై నిరంతరం పోలీసులు, ఎన్నికల అధికారులు ప్రత్యేకంగా నిఘా కొనసాగుతుందని..ఈ విషయంలో పోలీసులు, ఎన్నికల అధికారులు ప్రత్యేక దృష్టి కేంద్రీకరించారన్నారు. అలాగే పట్టుకొన్న నగదును అన్ని రకాల రశీదులు, తగిన సాక్ష్యాలతో తిరిగి తీసుకొనేందుకు జిల్లా జిల్లా కలెక్టర్ కార్యాలయ సముదాయంలో జిల్లా గ్రీవెన్స్ కమిటీ ఎఫ్-12లో గ్రీవెన్స్ కమిటీ లో సంప్ర దించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ తెలిపారు.

# కెసిఆర్ పాలనలోనే పల్లెలు కళకళలాడుతున్నాయి.... మంత్రి మల్లారెడ్డికి ఓటు వేస్తేనే కెసిఆర్ గెలుపుకు దోహదపడగలుతాం...

### మాజీ సర్పంచ్ గూదే ఎల్లయ్య యాదవ్

శామీర్ పేట ( గరుడ వార్త) :కాంగ్రెస్ పాలనలో కరెంటు నీళ్లు లేక రైతుల పొలాలు బీడులు వారాయని, అదే కేసీఆర్ పదేళ్ల పాలనలో తెలంగాణ పల్లెలు కళకళలాడుతున్నాయని అలియాబాద్ మాజీ సర్పంచ్ గూదే ఎల్లయ్య యాదవ్ అన్నారు. సోమవారం అలియాబాద్ గ్రామంలో బి ఆర్ ఎస్ నాయకులు ముద్దం మధుసూదన్ రెడ్డి, వల్లపు నాగేష్ ఇతర కార్యకర్తలతో కలిసి అలియాబాద్ మాజీ సర్పంచ్ ఎల్లయ్య



ఇంటింటి ప్రచారం నిర్వహించారు.
ఈ సందర్భంగా ఇంటింటికి ప్రచారం చేస్తూ, కేసీఆర్ చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలను, తద్వారా గ్రామంలో జరిగిన అభివృద్ధిని ఇంటింటికి వెళ్లి ప్రచారం నిర్వహిం చారు. బిఆర్ఎస్ పార్టీకి ఓటు వేస్తే తిరిగి తెలంగాణ అభివృద్ధిలో పరుగులు పెడుతుందంటూ ఓటర్లకు విన్నవించారు. మంత్రి మల్లారెడ్డికి ఓటు వేస్తేనే కెసిఆర్ గెలుపుకు ఓటు వేసినట్లు అంటూ ప్రచారం నిర్వహించారు.

# ముందస్తు సాగు సాధ్యమేనా..?

సూర్యాపేట : పంట కాలం నెల నుంచి 20 రోజులకు తగ్గించాలని ప్రభుత్వం నిర్ణయించినా.. అందుకు వరుణుడి కటాక్షం కష్టంగానే ఉంది. ఇటీవలి కాలంలో ఆగస్టులోనే పంటలకు వివిధ జలాశయాల నుంచి నీటి విడుదల ప్రారంభమవుతోంది. ఉమ్మడి జిల్లాలోని డిండి, మూసీ, నాగార్జునసాగర్ జలాశయాలకు జులై చివరి వారం నుంచి ఆగస్టు 15 లోపు వరదలు వచ్చే అవకాశాలు ఎక్కువ. అలాంటప్పుడు ఖరీఫ్ పంటకాలం ముందుకు తీసుకురావాలనుకుంటున్న ప్రభుత్వ ఆశయం నెరవేరే సూచనలు కనిపించడం లేదు. గత పదేళ్లలో సాగర్ ఎడమ కాల్వ పరిధిలో ఆగస్టుపైనే రైతులు ఆశలు పెట్టుకుంటున్నారు. మెట్ట పంటలకు సైతం జులైలో వచ్చే వర్షాలపైనే ఆధారపడుతున్నారు. జూన్‌లో వచ్చే అడపాదడపా వర్షాలకు భూమి చల్లబడినా పూర్తిగా విత్తనం మొలకెత్తే రీతిలో వర్షాలు పడటం లేదు. ఒకవేళ జూన్ 15 నుంచి చివరి వరకు వర్షం పడినా వేసవి ఎండ తీవ్రతకు రెండు రోజుల్లోనే నేల ఆరిపోతుంది. అలాంటప్పుడు మెట్టపంటలు వేసినా ఎండిపోయే ప్రమాదం ఉంది.

ఆగస్టుపైనే ఆశలన్నీ..

సాధారణంగా ఖరీఫ్ జూన్ నుంచి ఆరంభమవుతుంది. మృగశిర కార్తెలో విత్తుకుంటే పంట దిగుబడి వస్తుందని ఎప్పటి నుంచో రైతుల నమ్మకం. ఆ కాలంలో కార్తెల ప్రకారం వర్షాలు పడేవి. జొన్న, మొక్కజొన్న, సజ్జ, రాగులు, కంది, పెసర, మినుము వంటి ఆరుతడి పంటలు వేసుకునే వారు. వర్షాలు అనుకూలంగా పడితే వేరుశనగ సైతం కొంతమంది రైతులు నేల స్వభావాన్ని బట్టి వేసేవారు.

ఇప్పుడు నాటి వాతావరణ పరిస్థితులకు భిన్నంగా వర్షాలు పడుతున్నాయి. ఈసారి మేలో వర్షాలు పడుతున్నాయి. ఈ నేపథ్యంలో ఏ కార్తెలో విత్తుకోవాలో అర్థంకాని పరిస్థితి నెలకొంది. అందుకే రైతులు జులైలో మెట్టపంటలు వేసుకుంటున్నారు. నీటి సౌకర్యం, జలాశయా



లనుంచి కాల్వల ద్వారా నీరందే భూముల్లో వరి సాగుచేస్తున్నారు. వరిసాగు చేసే రైతులంతా ఆగస్టులో ఎగువ నుంచి (జూరాల, తుంగభద్ర, నారాయణపూర్, ఆలమట్టి జలాశయాల)వచ్చే వరదలను అంచనా వేసుకుంటూ నార్లు పోసుకోవడం, విత్తనాలు చల్లుకోవడం అవలంబిస్తున్నారు. వర్షాలు బాగా పడి, జలాశయాలు నిండితేనే భూగర్భజలాలు పెరిగి బోర్లు, బావులు, చెరువుల ద్వారా పంటకు సరిపడా నీరందుతుంది. అప్పుడు ముందుగా పంటలు సాగుచేసుకునే అవకాశం ఉంది.తక్కువ కాలంలో ఎక్కువ దిగుబడినిచ్చే రకాలను సాగుచేయడం మినహా ఇతర మార్గాల్లో సీజన్‌ను ముందుకు మార్చే అవకాశలేమీ లేవని శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. ప్రస్తుతం వ్యవసాయ పరిశోధనాస్థానాలు, ప్రైవేటు సంస్థల నుంచి 90-120 రోజుల్లో పంట చేతికి వచ్చే అనేక వరి వంగడాలు అందుబాటులోకి వచ్చాయి. వీటితో పాటు మెట్ట పంటలకు సైతం హైబ్రిడ్ రకాలు వస్తున్నాయి. దీని ఆధారంగానే పంటల సాగు చేపట్టాల్సి ఉంది. గత పదేళ్లలో 2021-22 సంవత్సరంలో మినహా జులైలో వరద వచ్చిన దాఖలాలు లేవు. ఒకవేళ వచ్చినా జులై చివరి వారంలో వచ్చినవే. 2021లో జులై 20న 34,538 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో మొదలై జులై 30న 2,63,835 క్యూసెక్కులు, 31నాటికి 3,99,034 క్యూసెక్కులు పెరిగింది. దీంతో జులైలో ఎక్కువ వరద నమోదైంది.

# వీరనారి.. మల్లు స్వరాజ్యం

నల్గొండ: ఆడబిడ్డ గడపదాటి అడుగు బయట పెడితేనే తప్పుగా భావించే రోజులవి.. స్త్రీలకు సంపూర్ణ స్వేచ్ఛ ఉండేది కాదు.. భూస్వామ్య కుటుంబంలో పుట్టినా నిరుపేదలు.. పీడిత ప్రజల విముక్తి కోసం సాగిన పోరాటంలో సుమారు 13 ఏళ్ల వయస్సులోనే ఆయుధం పట్టారు.. తెలంగాణ సాయుధ పోరాటంలో దళ సభ్యురాలిగా చేరి మొదట అజ్ఞాత జీవితం గడిపి ఆ తర్వాత.. ప్రజాక్షేత్రానికి వచ్చి ప్రజా ప్రతినిధిగా ఎన్నికయ్యారు. అటు పార్టీ కేంద్ర కమిటీ సభ్యురాలి స్థాయికి ఎదిగిన పోరాట యోధురాలు మల్లు స్వరాజ్యం. తుంగతుర్తి మండలంలోని కొత్తగూడెం గ్రామానికి చెందిన భీమిరెడ్డి రాంరెడ్డి, చొక్కమ్మ దంపతులకు జన్మించిన ఈమె తన సోదరుడు భీమిరెడ్డి నర్సింహారెడ్డి(బీఎన్‌రెడ్డి), అక్క శశిరేఖలతో కలిసి ఉద్యమ బాట పట్టారు. సాయుధ పోరాటంలో పాల్గొన్న మల్లు వెంకటనర్సింహారెడ్డిని 1954లో ఆమె వివాహం చేసుకున్నారు. వీరికి ఇద్దరు కుమారులు, ఒక కూతురు సంతానం.

నిజాం పోలీసులకు సింహస్వప్నం

పీడిత ప్రజల అభ్యున్నతి, వారి హక్కుల సాధనకు మల్లు స్వరాజ్యం పోరాడారు. నిజాం కాలంలో వెట్టిచారికి వ్యతిరేకంగా ఆంధ్ర మహిళా సభ ఆధ్వర్యంలో జరిగిన ఉద్యమంలో పాల్గొన్నారు. పేదల భూములను తన గుప్పిట్లో పెట్టుకొని వారిపై భూస్వాములు చేసే దౌర్జన్యాలు, శ్రమ దోపిడీని చూసి సహించలేక కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా నేతృత్వంలో సాయుధ పోరాటంలోకి దిగారు. తెలంగాణలోని పల్లెపల్లెకు తిరిగి నిజాం అరాచకాలకు వ్యతిరేకంగా ప్రజలను చైతన్య పరిచారు. నిజాం పోలీసులు, భూస్వాముల ప్రైవేటు సైన్యాలను హడలెత్తిస్తూ



తుపాకులు చేతబట్టి గెరిల్లా పోరాటంలో పాల్గొన్నారు. అజ్ఞాతంలో ఉంటూ తనలాంటి ఎందరో మహిళలకు శిక్షణ ఇచ్చారు.

పట్టిస్తే రూ. పది వేల నజరానా..

నిజాం ప్రభుత్వానికి వ్యతిరేకంగా పాటలు కట్టి ప్రజలను చైతన్యవంతులను చేయటం, గడీలపై దాడులు చేసి ధాన్యాన్ని పేదలకు పంచడం, గ్రామాలకు విముక్తి చేసి రైతులకు భూములు ఇప్పిస్తున్న ఆమె ధైర్య సాహసాలను నిజాం సైన్యాలు ఎదుర్కొలేకపోయాయి. ఆమెను పట్టిస్తే రూ.పది వేల నజరానా ఇస్తామని నిజాం ప్రభుత్వం ప్రకటించింది.

ప్రజాప్రతినిధిగా... పార్టీ కేంద్ర కమిటీ సభ్యురాలిగా..

సాయుధ పోరాటం ముగిసిన అనంతరం మల్లు స్వరాజ్యం సీపీఐలో చేరి పార్టీ ఉన్నతికి కృషిచేశారు. తుంగతుర్తి నియోజకవర్గాన్ని కమ్యూనిస్టుల కంచుకోటగా మార్చడానికి పాటు పడ్డారు. ఆ తర్వాత ప్రత్యక్ష ఎన్నికల్లో పాల్గొని 1978, 1983లో కాంగ్రెస్ అభ్యర్థులపై తుంగతుర్తి ఎమ్మెల్యేగా గెలుపొందారు. 1985లో రాంరెడ్డి దామోదర్‌రెడ్డిపై ఓడిపోయారు. 1996లో మిర్యాలగూడ లోక్‌సభ స్థానం నుంచి సీపీఐ(ఎం) నుంచి బరిలో నిలిచి కాంగ్రెస్ అభ్యర్థి బద్దం నర్సింహారెడ్డి చేతిలో ఓటమి పాలయ్యారు. ఆ తర్వాత పార్టీ కార్యకలాపాల్లో పాల్గొంటూ కేంద్ర కమిటీ సభ్యురాలి స్థాయికి చేరి ఆదర్శ నాయకురాలిగా గుర్తింపు తెచ్చుకున్నారు. ఆమె మార్చి 19, 2022లో చనిపోయారు.

# సరిపోవట్లే సమయం

ఇందూరు : ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులు ప్రచారంలో భాగంగా క్షేత్రస్థాయిలో ఓటర్లందరినీ చేరుకునేందుకు అధిక సమయం కావాలనుకుంటారు. కానీ ప్రస్తుతం పోలింగ్‌కు గడువు సమీపిస్తుంది. ఈ నేపథ్యంలో విస్తృతంగా ప్రచారం చేస్తూనే మిగిలిన ఈ కొద్ది రోజులు ప్రణాళికాబద్ధంగా వినియోగించుకోవాలని భావిస్తున్నారు. అలా ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో బరిలో నిలిచిన వారిలో ప్రధాన పార్టీల అభ్యర్థులు 27 మందితో పాటు ఇతర పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులు తమ దైనందిన జీవితాన్ని మార్చుకున్నారు. తెల్లవారుజామునే నిద్ర లేచి ప్రచారానికి సిద్ధమవుతున్నారు. తిరిగి అర్ధరాత్రి వరకు ఎన్నికలను ఎలా ఎదుర్కొనాలి అనే అంశంపై ప్రణాళికలు, వాటి అమలులో నిమగ్నమవుతున్నారు.

సహాయకుల పరిస్థితి అంతే

అన్ని పనులు చక్కబెట్టుకోవడం అభ్యర్థుల రోజువారీ బిజీ షెడ్యూలులో క్లిష్టమే. ఈ కీలక సమయంలో ఏది మరిచిపోయినా.. అది చివరికి ఫలితాలపై ప్రభావం చూపిస్తుంది. అందుకే ప్రతి క్షణం, ప్రతి విషయం అభ్యర్థులకు అత్యంత ముఖ్యమైనవే. అందుకే ఈ సమయంలో వారి వ్యక్తిగత సహాయకుల పాత్ర కీలకమవుతుంది. నిర్దేశించుకున్న పనులు నిర్ణీత సమయానికి గుర్తు చేయడం, అందరినీ సమన్వయం చేయడం వంటి బాధ్యతలు వీరు నిర్వర్తిస్తారు. అలా అభ్యర్థులకు సహకారం అందిస్తున్న వారు సైతం సమయాభావ సమస్య ఎదుర్కొంటున్నారు.

అభ్యర్థుల దినచర్య

జిల్లాలోని ప్రధాన పార్టీల అభ్యర్థుల దినచర్యను పరిశీలించగా దాదాపు అందరూ ఒకేరకమైన జీవనశైలి అనుసరిస్తున్నారని తెలుస్తోంది. ప్రజలకు చేరువ కావడానికి కొందరు నాయకులు సాయంత్రం దాటినా పర్యటనలు, ప్రచారంలోనే ఉంటూ ఇంటింటికీ వెళ్లి మద్దతు కోసం అభ్యర్థిస్తున్నారు.

ఉదయం 6 గంటలకల్లా ప్రచారంలోకి దిగుతున్నారు. ఆ రోజు ఎవరెక్కడ ప్రచారం చేస్తున్నారు. వారంతా క్షేత్రస్థాయికి చేరుకుంటున్నారా? లేదా? అని ఆరా తీయడం, అవసరమైతే పార్టీ బూత్, మండల స్థాయి ఇన్‌ఛార్జులతో మాట్లాడుతున్నారు. ఉదయం 8 గంటల వరకు కాలకృత్యాలు తీర్చుకుని అల్పాహారం తీసుకుని సిద్ధమవుతున్నారు.

ఉదయం 8– 9 గంటల మధ్య ముఖ్యులతో మంతనాలు చేస్తున్నారు. ఆ రోజుకు సంబంధించిన పనులు నిర్దేశించి పురమాయిస్తున్నారు.

9 గంటలకు ముందు నిర్ణయించిన షెడ్యూలును అనుసరించి ప్రచారానికి బయల్దేరి వెళ్తున్నారు.

మధ్యాహ్నం 1–2 మధ్య భోజన విరామం.

విరామం అనంతరం గంట పాటు అనుచరులతో భేటీ.

2 గంటల తర్వాత ఎన్నికల ప్రచారం. 7 గంటల వరకు ప్రచారం ముగించుకుని ఇంటికి తిరిగి వెళ్తున్నారు. 8 గంటల తర్వాత తిరిగి ముఖ్య నాయకులు, అనుచరులతో రహస్య మంతనాలు. వ్యూహాలపై చర్చలు. ఇది సందర్భాన్ని బట్టి అర్ధరాత్రి 12 – ఒంటిగంట వరకు సాగుతోంది. ప్రధానంగా అసంతృప్తులను బుజ్జగించడం, పార్టీలోకి ఆహ్వానించాల్సిన కొత్త వారి గురించి చర్చలు జరుపుతున్నారు. తిరిగి మరుసటి రోజు షెడ్యూలు నిర్ధారించుకోవడం వంటివి చేస్తున్నారు. మధ్యలో కాస్త సమయం తీసుకుని రాత్రి భోజనం చేస్తున్నారు.

# నియోజకవర్గాలపై నిఘా




భువనగిరి : ఎన్నికల నిబంధనల అమలు.. అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు కేంద్ర ఎన్నికల సంఘం నియమించిన పరిశీలకులు వచ్చేశారు. వారు కార్యరంగంలో దిగారు. ఎన్నికల ఏర్పాట్లు, అభ్యర్థులు చేస్తున్న ఖర్చు, అక్రమాలకు అడ్డుకట్టవేసేందుకు డేగ కళ్లతో నిఘా పెట్టారు. నామినేషన్ల పర్వం ప్రారంభం కాగానే వారు జిల్లాలకు చేరుకున్నారు. గతంలో సాధారణ పరిశీలకుడు, వ్యయ పరిశీలకులను మాత్రమే నియమించిన కేంద్ర ఎన్నికల సంఘం ఈ సారి శాంతిభద్రతల పర్యవేక్షణకు ఐపీఎస్ అధికారిని ప్రత్యేకంగా పోలీస్ పరిశీలకుడిని నియమించింది. సాధారణ పరిశీలకుడిగా తమిళనాడు రాష్ట్రానికి చెందిన సీనియర్ ఐఏఎస్ అధికారి డాక్టర్ మహేశ్వరన్‌ను, వ్యయ పరిశీలకుడిగా భారత డిఫెన్స్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్‌లో పనిచేస్తున్న రాకేశ్‌కుమార్, పోలీస్ పరిశీలకుడిగా కర్ణాటకకు చెందిన సీనియర్ ఐపీఎస్ అధికారి విపుల్‌కుమార్ నియమితులయ్యారు. జిల్లాలో ఎన్నికల ఏర్పాట్లు, భద్రతా చర్యలు, ఎన్నికల నియమావళి అమలుకు తీసుకున్న చర్యలు, ఓటర్ల వివరాలు భౌగోళిక పరిస్థితులను జిల్లా కలెక్టర్ హన్మంత్ కె.జెండగే పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఎన్నికలకు సంబంధించి రెండు నియోజకవర్గాలకు చెందిన సమగ్ర నివేదికను అందించారు. ఇప్పటికే వారు స్ట్రాంగ్‌రూం, డిస్ట్రిబ్యూషన్, ఓట్ల లెక్కింపు కేంద్రాలను పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నాటి నుంచే క్షేత్ర స్థాయిలో ఎన్నికల నియమావళి అమలుకు జిల్లా స్థాయిలో ఏర్పాటు చేసిన ఫ్లయింగ్ స్క్వాడ్, స్టాటిక్ సర్వెలెన్స్, ఎంసీసీ బృందాలు పర్యటిస్తూ ముమ్మరంగా దాడులు, తనిఖీలు నిర్వహిస్తున్నాయి. వీటి పనితీరు గమనిస్తూ వారిచ్చిన నివేదికలను పరిశీలించి తాము గమనించి అంశాలతో పరిశీలకులు కేంద్ర ఎన్నికల సంఘానికి నేరుగా ఆన్‌లైన్లో నివేదికలు అప్‌లోడ్ చేస్తారు.

అడ్డుకట్ట వేసేందుకు...జిల్లాలోని భువనగిరి, ఆలేరుల్లో ప్రతిష్ఠాత్మక పోటీ జరుగుతోంది. గెలుపు కోసం ప్రధాన పార్టీ అభ్యర్థులు విచ్చలవిడిగా ఖర్చు చేస్తున్నారని, ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు నగదు పంపిణీ, పెద్ద ఎత్తున నజరానాలు పంపిణీ చేయనున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఓటర్లను ప్రభావితం చేసే అవకాశం ఉందన్న సమాచారంతో ప్రత్యేక నిఘా పెట్టినట్లు సమాచారం. వీటికి అడ్డుకట్టవేసేందుకు పరిశీలకులు కన్నేసి ఉంచారని తెలుస్తోంది.

ప్రజలకు అందుబాటులో సాధారణ పరిశీలకుడు

కేంద్ర ఎన్నికల సంఘం నియమించిన సాధారణ పరిశీలకుడు డాక్టర్ మహేశ్వరన్ ప్రజలకు అందుబాటులో ఉండనున్నారు. జిల్లా కలెక్టరేట్‌లోని మినిస్టర్ ఛాంబర్‌లో ప్రతి రోజు సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు అభ్యర్థులు, ప్రజలకు అందుబాటులో ఉండి ఫిర్యాదులు స్వీకరిస్తారు. ఎన్నికలు ముగిసే వరకు ఆయన క్షేత్ర స్థాయిలో పర్యటించడంతో పాటు సాయంత్రం వినతులు స్వీకరిస్తారు. శాంతియుత వాతావరణంలో ప్రజలు స్వేచ్ఛగా ఓటేయడం, ప్రలోభాలకు గురిచేయకుండా అరికట్టడం లక్ష్యంగా ఏర్పాటు చేసిన కేంద్ర పరిశీలకుల చర్యలు ఏ మేరకు నియంత్రిస్తామో వేచిచూడాలి.

# నాసిరకం విత్తనం.. నట్టేట ముంచే!



మేళ్లచెరువు : మిరప నాసికరం విత్తనం రైతుల్ని నట్టేట ముంచింది. సూర్యాపేట జిల్లా మేళ్లచెరువు, చింతలపాలెం, మఠంపల్లి మండలాలకు చెందిన దాదాపు ఆరు వందల మంది రైతుల కష్టాన్ని మింగేసింది. కష్టంతో పాటు దాదాపు 12 వందల పైచిలుకు ఎకరాల్లో సుమారు రూ.18 కోట్ల పెట్టుబడుల్నీ తినేసింది. పంట వేసి తొంభై రోజులు దాటుతుండగా ఈపాటికే ఎకరానికి దాదాపు 20 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చేది. మిరపకు ఇప్పుడున్న మార్కెట్ ధర ప్రకారం.. రూ.48 కోట్ల విలువైన పంట చేతికందేది. అలాంటిది కనీసం ఒక క్వింటా కూడా బాధిత రైతుల చేతికి దక్కలేదు. గురువారం దొండపాడు వచ్చిన సదరు కంపెనీ ప్రతినిధులను రైతులు నిలదీయడంతో ఈ మొత్తం వ్యవహారం వెలుగుజూసింది.

ప్రముఖ కంపెనీ పేరుతో మార్కెట్‌లోకి...

ఈ ప్రాంతంలో సీజన్ ప్రారంభంలోనే ఓ ప్రముఖ కంపెనీకి చెందిన ఓ రకం మిరప విత్తనాలను మార్కెట్‌లోకి తెచ్చారు. రైతులకు విక్రయించారు. ఏపీలోని పిడుగురాళ్ల, జగ్గయ్యపేట, వత్సవాయి, తెలంగాణలోని సూర్యాపేట, ఇతర జిల్లాల డిస్ట్రిబ్యూటర్ల నుంచి కంపెనీ ప్రతినిధులు, నర్సరీల యాజమాన్యం విత్తనాలను తెప్పించారు. ఇక్కడి నర్సరీల్లో మొక్కలు పెంచి రైతులకిచ్చారు. 90 రోజుల కిందటే రైతులు ఈ మిరప మొక్కలు నాటారు. వందరోజులొస్తున్నా ఇంతవరకు కాయలు కాయ లేదు. అనుమానం వచ్చిన రైతులు కంపెనీ ప్రతినిధులను రెండుసార్లు పిలిపించి చెప్పారు. అయినా ఫలితం లేదు. వ్యవసాయం, ఉద్యానవన అధికారుల దృష్టికీ తీసుకెళ్లారు. చర్యలు శూన్యం.

పరీక్షలకు పంపితేనే తెలుస్తుంది: కంపెనీ ప్రతినిధులు

మొక్కలను డీఎన్ఏ పరీక్షలకు పంపితే ఏం జరిగిందో తెలుస్తుంది. ఇక్కడ ఈసారి ప్రతికూల వాతావరణం ఉందని భావిస్తున్నాం. రైతులకు ఇబ్బంది రాకుండా సమస్యను యాజమాన్యం దృష్టికి తీసుకెళ్తున్నాం.

శాస్త్రవేత్తల దృష్టికి తీసుకెళ్లాం: శ్రీధర్, జిల్లా ఉద్యాన అధికారి

రైతుల ఫిర్యాదు మేరకు మిరప తోటలను పరిశీలించాం. శాస్త్రవేత్తల దృష్టికి తీసుకెళ్లాం. ప్రభుత్వ పరంగా తగు చర్యలు తీసుకుంటున్నాం.

సాగర్ ఎడమకాల్వకు నీటి విడుదల

నాగార్జునసాగర్: నాగార్జునసాగర్ ఎడమకాల్వకు ఎన్నెస్పీ అధికారులు గురువారం సాయంత్రం నీటిని విడుదల చేశారు. ఖమ్మం జిల్లాలో తాగునీటి అవసరాల నిమిత్తం పాలేరు జలాశయంలో నీటిమట్టాన్ని పెంచడం కోసం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రోజుకు 5 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు అధికారులు చెప్పారు. ఎన్ని టీఎంసీ, ఎన్ని రోజులు విడుదల చేయాలన్న విషయం గురించి ఎటువంటి ఆదేశాలు అందలేదని వారు పేర్కొన్నారు.

# గుర్తుకొస్తే..గుబులే..!

నల్గొండ: అసెంబ్లీ ఎన్నికల్లో నామినేషన్ల ఉపసంహరణ ఘట్టం ముగియడంతో ప్రధాన పార్టీల అభ్యర్థులకు గుర్తుల గుబులు పట్టుకుంది. గత ఎన్నికల్లో నకిరేకల్, కోదాడతో పాటూ భువనగిరి ఎంపీ స్థానంలో ప్రధాన పార్టీలను పోలిన గుర్తులు, స్వతంత్ర అభ్యర్థుల పోటీతో ఫలితాలు తారుమారు కావడంతో ఇప్పుడు అభ్యర్థుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ప్రతి నియోజకవర్గంలో చిన్న, రిజిస్టర్డ్ పార్టీలు, స్వతంత్రులు పెద్ద ఎత్తున నామినేషన్‌లు దాఖలు చేశారు. దీంతో బ్యాలెట్‌లో వారికి ప్రధాన పార్టీలను పోలిన గుర్తులు వస్తే ఓటర్లు గందరగోళానికి గురయ్యే అవకాశం ఉంటుందని ప్రధాన పార్టీలు ఎన్నికల సంఘానికి మరోసారి ఫిర్యాదు చేయడానికి సిద్ధమవుతున్నాయి. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో నకిరేకల్ నుంచి పోటీ చేసి గెలిచిన అభ్యర్థికి 8,259 ఓట్లు మెజార్టీ రాగా.. ఇక్కడి నుంచి సమాజ్‌వాదీ ఫార్వర్డ్ బ్లాక్ నుంచి ట్రక్కు గుర్తుపై పోటీ చేసిన దుబ్బ రవి అనే అభ్యర్థికి ఏకంగా 10,383 ఓట్లు వచ్చాయి. కోదాడలోనూ భారాస తరఫున గెలిచిన ప్రస్తుత ఎమ్మెల్యేకు 756 ఓట్లు మెజార్టీ రాగా..ఇక్కడ స్వతంత్ర అభ్యర్థికి ఏకంగా 5,240 ఓట్లు వచ్చాయి. నోటాకు సైతం 1,240 ఓట్లు రావడంతో ఫలితం తారుమారైందని కాంగ్రెస్ అభ్యర్థి అప్పట్లో ఆరోపించారు. 2019 భువనగిరి లోక్‌సభ ఎన్నికల్లోనూ కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి 5 వేల ఓట్ల మెజార్టీతో గెలవగా...ఇక్కడ కారు గుర్తును పోలిన రోడ్డు రోలర్ నుంచి పోటీ చేసిన అభ్యర్థికి ఏకంగా 25 వేల ఓట్లు వచ్చాయి. ఇప్పుడూ ఉమ్మడి జిల్లాలోని చాలా చోట్ల ఇదే పరిస్థితి ఉండటంతో వీరు ఎవరి గెలుపు అవకాశాలను దెబ్బకొడతారనే చర్చ సాగుతోంది. ప్రస్తుత ఎన్నికల్లో యుగతులసి పార్టీ నుంచి పోటీ చేస్తున్న అభ్యర్థులకు ఎన్నికల కమిషన్ రోడ్డు రోలర్ గుర్తును కేటాయించింది. చాలా మంది స్వతంత్రులకు చపాతి రోలర్, ట్రక్కు గుర్తులను కేటాయించారు. దీంతో ఈ గుర్తులను తొలగించాలని గతంలోనే అధికార భారాస ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసినా ఎటువంటి చర్యలు చేపట్టలేదని...ఇప్పటి ఎన్నికల్లోనూ తమ గుర్తును పోలిన గుర్తులే కేటాయించారని ఓ ఎమ్మెల్యే



అభిప్రాయపడ్డారు. స్వతంత్రులతోనూ కష్టమే ఉమ్మడి జిల్లాలోని పన్నెండు నియోజకవర్గాల్లో మునుగోడులో అత్యధికంగా 39 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. వీరిలో స్వతంత్రులే ఎక్కువ. దేవరకొండ, సాగర్ మినహాయించి మిగిలిన 10 నియోజకవర్గాల్లో హీనపక్షం 15 మంది స్వతంత్రులు బరిలో ఉన్నారు. దీంతో పాటూ ప్రధాన పార్టీల నుంచి పోటీలో ఉన్న అభ్యర్థుల పేర్లతో లేదంటే ఇంటి పేర్లతోనూ కొంత మంది బరిలో ఉన్నారు. ఉదాహరణకు నల్గొండ నుంచి భారాస తరఫున పోటీ చేస్తున్న కంచర్ల భూపాల్‌రెడ్డికి కారు గుర్తును కేటాయించగా..అలియెన్స్ ఆఫ్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ పార్టీ తరఫున బరిలో ఉన్న కంచర్ల ఆనంద్‌రెడ్డికి చపాతి రోలర్ గుర్తును కేటాయించారు. దీంతో అధికార పార్టీ శ్రేణులు ఓటర్లు గందరగోళ పడకుండా ఈవీఎంలలో తమ అభ్యర్థి గుర్తులతో సహా ఇంటింటి ప్రచారం చేస్తున్నారు. మిర్యాలగూడలో కాంగ్రెస్ తరఫున బత్తుల లక్ష్మారెడ్డి పోటీ చేస్తుండగా...అదే పేరు ఉన్న బారెడ్డి లక్ష్మారెడ్డి స్వతంత్ర్య అభ్యర్థిగా బరిలో ఉన్నారు. వీరిని నామినేషన్ నుంచి ఉపసంహరించేందుకు ప్రధాన పార్టీల అభ్యర్థులు ప్రయత్నాలు చేసినా అవి ఫలించలేదు. అయితే ఎదుటిపార్టీ నాయకుల ఒత్తిళ్ల వల్లే వీరు బరిలో ఉన్నారని కొంతమంది అభ్యర్థులు ఆరోపిస్తున్నారు. ఎన్నికల ప్రచారం ముమ్మరమవుతున్న నేపథ్యంలో గుర్తులు, స్వతంత్రులతో ఏ మేరకు తాము నష్టపోతామోనన్న భావన అన్ని పార్టీల అభ్యర్థుల్లో నెలకొంది.

# సాంకేతిక సాయం

పాల్వంచ : ఉభయ జిల్లాల్లో ఎన్నికల ప్రక్రియలో నామినేషన్ల హడావిడి ముగిశాక అన్ని పార్టీల అభ్యర్థులు ప్రచారాన్ని వేగవంతం చేశారు. అయిదేళ్లకోసారి వచ్చే ఎన్నికల పండగలో అధికారులు సాంకేతిక పరిజ్ఞానాన్ని ఎంత సమర్థంగా వినియోగించుకుంటున్నారో ఆయా పార్టీలూ బరిలో నిలిచేందుకు, గెలిచేందుకు తమ ప్రచారాస్త్రాలుగా అంతే సమర్థంగా దీన్ని ఉపయోగించుకుంటున్నాయి. కార్యకర్తల సాయంతో ఇంటింటికీ తిరుగుతూ ప్రచారం చేయటం ఓ ఎత్తయితే, ప్రతి నెటిజన్‌కు పోస్టర్ పంపడం మరో అస్త్రంగా భావిస్తున్నారు. డిజిటల్ యుగంలో దాదాపు అందరి చేతుల్లో స్మార్ట్‌ఫోన్ ఉంటోంది. దాన్నే తమ ప్రచార వేదికగా మలుచుకుంటున్నారు. ఫలితంగా వాట్సప్, మెటా, ఎక్స్, ఇన్‌స్టాగ్రామ్‌లు రణ వేదికలుగా మారుతున్నాయి. ఆయా మాధ్యమాల సాయంతో ప్రధాన పార్టీల అభ్యర్థులు, స్వతంత్రులు నెటిజన్ ఓటరు మదిలో దూరేందుకు యత్నిస్తున్నారు. ఈ ప్రయత్నంలో తమ పార్టీ కార్యాలయాల్లో, క్యాంపు ఆఫీసుల్లో ప్రత్యేక బృందాలను నియమించుకున్నారు. ఇంకోపక్క జిల్లా వ్యాప్తంగా పలువురు డిజిటల్ నిపుణులు దీన్ని ఉపాధిగా మలుచుకుంటున్నారు.

ఎలా వినియోగిస్తున్నారు?

డిజిటల్ పోస్టర్లు

1. బరిలో ఉన్న అభ్యర్థులు నియోజకవర్గ ప్రజలకు తామేం చేశామో చెబుతూ వీటిని సామాజిక మాధ్యమాల్లో ఉంచుతున్నారు. అంశాన్ని మారుస్తూ ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం.. ఇలా నిత్యం మూడుసార్లు పోస్టులుండేలా జాగ్రత్తపడుతున్నారు. వాటిని సామాజిక మాధ్యమాల్లో వైరల్ చేస్తున్నారు. ప్రత్యర్థి వర్గాలు కామెంట్ చేస్తే ప్రతి సమాధానమిస్తున్నారు తప్పితే తమకు తాముగా విమర్శనాస్త్రాలు సంధించటం లేదు. సందర్భానుసారం మీమ్స్ రూపొందిస్తున్నారు. వీటినే కార్యకర్తలు, నాయకులు అనుసరిస్తూ ప్రజల్లోకి తీసుకెళ్తున్నారు.

2. 'ఇగో అన్నా.. ఈ రోజు మనూరు అన్న వస్తుండు. మీరందరూ ఇళ్లనే ఉండాలే, అన్న చెప్పేది గమ్మున వినాలే.. మా గుర్తుపై ఓటెయ్యాలే'.. అంటూ అభ్యర్థుల ప్రచార వివరాలను పొందుపరుస్తున్నారు. నేడు ఏఏ మండలాల్లో ప్రచారం ఉంటుంది? ఏఏ గ్రామాల్లో పర్యటిస్తారు? ప్రధానాంశాలను అందులో ఉంచుతున్నారు. డిజిటల్ క్రియేటివిస్టులు ఈ క్రమంలో సృజనకు పెద్దపీట వేస్తున్నారు. వీటిని వైరల్ చేసే క్రమంలో వాట్సప్‌లో లాంటి వాటిల్లో కొత్తగా వచ్చిన ఛానల్స్ ఫీచర్‌ను సద్వినియోగం చేసుకుంటున్నారు. దీన్ని అనుసరించమని శ్రేణులకు దిశానిర్దేశం చేస్తున్నారు.

వ్యంగ్యాస్త్రాలు

1. డిజిటల్ పరిజ్ఞానం సాయంతో ప్రత్యర్థి పార్టీ, అభ్యర్థిని లక్ష్యంగా చేసుకునే వ్యంగ్యాస్త్రాలు సంధిస్తున్నారు. పార్టీల ఫిరాయింపు, తాయిలాలు, స్థానిక అభివృద్ధి– అవినీతి, మ్యానిఫెస్టోలో లోటుపాట్లు వంటివాటిని అస్త్రాలుగా చేసుకుని కార్టూన్ల రూపంలో పరస్పరం సవాళ్లు విసురుతున్నారు. విమర్శలు చేస్తున్నారు.



2. నియోజకవర్గ పరిధిలో రాజకీయ అంశాల్లో దైనందిన మార్పులు, చేర్పులు, కుదుపులు ఉన్నట్టయితే వాటిని పార్టీలు తమకు అనుగుణంగా మార్చుకుంటున్నాయి. క్యాప్షన్ ఇచ్చి తమ అభ్యర్థుల, పార్టీ చిత్రాలతో మీమ్స్ రూపొందిస్తున్నారు.

3. 'మీ అభ్యర్థిం ఏం చేశారు? సంక్షేమ పథకాలన్నీ మీకే ఇచ్చారు. మా గతేంది' అని ఓ పార్టీ కార్యకర్త ప్రశ్నిస్తే... 'లబ్ధిదారులు ఏ పార్టీ వారిని కాకుండా వారు అర్హులా? కాదా? అనేది చూడాల'ని బదులిస్తున్నారు. మంచిలో చెడును.. చెడులో మంచిని వెతుకుతూ సామాజిక మాధ్యమాల్లో దీటైన పోస్టులు పెడుతున్నారు. ఇవే కొన్నిసార్లు వివాదాలకు దారితీస్తున్నాయి.

ఉపాధినిస్తుంది..

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వందల సంఖ్యల్లో ఫొటో స్టూడియోలు, ఫ్లెక్సీ డిజైన్ దుకాణాలున్నాయి. వీటితోపాటు పలు అసోషియేషన్లలో వందలోపు మల్టీమీడియా డిజైనర్లున్నారు. నిపుణులైన సుమారు 30 మంది డిజైనర్లు పలు పార్టీలకు, ఎమ్మెల్యే అభ్యర్థులకు సేవలందిస్తున్నారు. కొందరు సంవత్సరం, నెల, రోజులు, ఈవెంట్ల చొప్పున ప్యాకేజీలు మాట్లాడుకొని డిజిటల్ పోస్టర్లు, మీమ్స్ తయారు చేస్తున్నారు. ఎన్నికల సీజన్‌లో చేతినిండా పనిదొరకడంతో రూ.వేలల్లో అర్జిస్తున్నారు. కమ్యూనిస్టులు, బాసపా లాంటి పార్టీలు కూడా సామాజిక మాధ్యమాలను అనుసరిస్తుండటంతో వీరికి బాగా గిరాకీ పెరిగింది. నిపుణులైన డిజైనర్లకు తీరిక లేకుండా ఆర్డర్లు వస్తుండటం గమనార్హం.

జిల్లాలో కార్టూనిస్టులకు డిమాండ్ పెరిగింది. స్థానిక అంశాలపై వేసే వ్యంగ్యాస్త్రాలు ఓటర్లను విపరీతంగా ఆకర్షిస్తాయనే ఉద్దేశంతో పార్టీలు వీటికి, వీరికి ప్రాధాన్యం ఇస్తున్నాయి.

కొన్ని పోస్టులు పార్టీ కార్యకర్తలు పెడుతుండగా, మరికొన్ని పార్టీల సామాజిక మాధ్యమాల నిర్వాహకులు, రాజకీయ అవగాహన ఉన్న నిపుణులు పోస్టు చేస్తున్నారు. తటస్థులు మాత్రం ప్రతిదీ గమనిస్తూ మిన్నకుంటున్నారు.

నిల్చుని వెళ్తే ఒక కూలి.. వీధులు తిరిగితే మరోలా!


ఒకప్పుడు ఏదైనా పార్టీ నేత సమీప పట్టణానికో, గ్రామానికో వస్తున్నారంటే అభిమానులు, కార్యకర్తలు ఆ పూట పనులు ఆపుకొని మరీ చూసేవారు. ఇప్పుడు రాజకీయాల తీరు.. నేతాగణం వ్యవహార శైలి పూర్తిగా మారింది. తాజా ఎన్నికల్లో కొత్తగూడెం నియోజకవర్గంలో కొందరు అభ్యర్థులు, పార్టీ నేతలు ఏదైనా గ్రామానికి ప్రచారానికి వస్తే, స్థానిక అనుయాయులైన ద్వితీయ శ్రేణి, మండల, గ్రామస్థాయి నాయకులు జన సమీకరణకు తంటాలు పడుతున్నారు. పైస్థాయి నేతల ఆదరణ కోసం తాపత్రయపడుతున్నారు. 'కాసేపు నిల్చుని వెళ్తే ఒక కూలి.. నాలుగు వీధులు కలియదిరిగితే మరో కూలి' అంటూ వచ్చిన వారి చేయి తడిపితే తప్ప ప్రచారం బోసిపోయేలా ఉందని వారు వ్యాఖ్యానిస్తున్నారు. ఇటీవల పాల్వంచ మండలంలోని రంగాపురానికి ఇటీవల ఓ ప్రధాన పార్టీ అభ్యర్థి ప్రచారానికి వచ్చాడు. వ్యవసాయ సీజన్ కావడంతో ప్రచార రథం వద్ద పట్టుమని పది మందీ గుమికూడని పరిస్థితి ఎదురైంది. ముందే ఊహించిన స్థానిక నాయకులు సమీప గూడేల నుంచి సుమారు 50 మంది ప్రచార కూలీలను రప్పించారు. మధ్యాహ్నం వరకు కూలి మాట్లాడుకుని, ఒక్కొక్కరికి రూ.200 నుంచి రూ.250 వరకు ముట్టజెప్పినట్లు సమాచారం. దాదాపు ఏ నియోజకవర్గంలో చూసినా గ్రామాలు, పట్టణాలనే తేడా లేకుండా ఇవే 'సిత్రాలు' కనిపిస్తున్నాయి. "నలుగురు ఎమ్మెల్యేలు, పదిమంది ప్రజాప్రతినిధులు, మరో ఆరుగురు నాయకుల మీమ్స్, డిజిటల్ పోస్టర్లు రూపొందిస్తున్నా. సాధారణ రోజుల్లో ప్రత్యేక సందర్భాల్లో మాత్రమే పని ఉండేది. ప్రస్తుతం నేను తయారుచేస్తున్న పోస్టర్‌లు వాడే పలువురి వ్యక్తిగత ఖాతాలను వేల సంఖ్యల్లో అనుసరిస్తున్నారు." పిట్టల వినయ్, డిజిటల్ క్రియేటివిస్టు, నేలకొండపల్లి

# వెనక్కి తగ్గలే

హైదరాబాద్: ఈ సారి ఎన్నికల్లో భారాస, భాజపా, కాంగ్రెస్ పార్టీలకు దీటుగా చిన్నపార్టీల నాయకులు, స్వతంత్రులు పోటీకి గట్టిగానే నిలబడ్డారు. ఉపసంహరించుకోవాలంటూ కొందరిపై ఒత్తిళ్లు వచ్చినా పోటీలోనే ఉంటామంటూ తేల్చిచెప్పారు. దీంతో హైదరాబాద్ శివారులోని 13 నియోజకవర్గాల్లో ప్రధాన పార్టీల అభ్యర్థులతోపాటు బరిలో మొత్తం 335 మంది పోటీలో ఉన్నారు. భాజపా, కాంగ్రెస్ పార్టీల నుంచి తొలుత అసమ్మతి వ్యక్తమైనా తర్వాత అగ్రనేతలు ముందుగానే ఒప్పించడంతో శేరిలింగంపల్లి, కూకట్‌పల్లి, రాజేంద్రనగర్, మహేశ్వరం, ఇబ్రహీంపట్నం నియోజకవర్గాల్లో రెబల్స్ బెడద తప్పింది. ఈ ఎన్నికల్లో ఎలాగైనా సత్తా చాటాలన్న లక్ష్యంతో కొందరు నాయకులు స్వతంత్రులుగా పోటీ చేస్తున్నారు. దీంతో కొన్ని నియోజకవర్గాల్లో స్వతంత్రులు, చిన్నపార్టీల ప్రభావం అధికార, ప్రతిపక్ష పార్టీల అభ్యర్థుల ఓటింగ్‌పై ప్రభావం చూపించనుందని అంచనా.

వ్యక్తిగత ప్రతిష్ఠ..సామాజిక అంశాలు...

స్వతంత్రులు, చిన్న రాజకీయ పార్టీల నుంచి అభ్యర్థులుగా పోటీ చేస్తున్న వారిలో చాలామంది తమ వ్యక్తిగత ప్రతిష్ఠ పెంచుకునేందుకు, అధికార పార్టీ అభ్యర్థుల దృష్టికి సామాజిక అంశాలను తీసుకెళ్లేందుకు నామినేషన్లు దాఖలు చేసినట్లు తెలుస్తోంది. ఎమ్మెల్యేగా పోటీ చేసేందుకు అవసరమైన రూ.10వేలు ధరావతు సొమ్మును చెల్లిస్తున్నారు. అనంతరం సామాజిక మాధ్యమాల్లో తమ అజెండాను పోస్ట్ చేస్తూ



ప్రచారం చేసుకుంటున్నారు.

మేడ్చల్ నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేస్తున్న ఓ యువకుడు తమ ప్రాంతాల్లో దోమల బెడదను తప్పించేందుకు, అధ్వానంగా ఉన్న మురుగునీటి వ్యవస్థను మెరుగు పర్చేందుకు అవసరమైన అంశాలను ప్రచారంలో ప్రస్తావిస్తున్నాడు. ఉప్పల్ నుంచి పోటీ చేస్తున్న ఒక చిన్న రాజకీయ పార్టీ ప్రతినిధి ఎన్నికల అధికారులు ఇచ్చిన ధ్రువీకరణ పత్రాన్ని తన ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌లో, ఎక్స్ వేదికల్లో పోస్ట్ చేశారు. సామాజిక మాధ్యమాల్లో ప్రచారం వస్తేచాలని అనుకుంటున్నాడు.

ముంచుతారా?..గట్టెక్కిస్తారా?

స్వతంత్ర అభ్యర్థులు భారీ సంఖ్యలో ఉండడంతో ప్రధాన పార్టీల అభ్యర్థుల్లో కాస్త కంగారు మొదలైంది. 5 వేలలోపు ఓట్లు స్వతంత్ర అభ్యర్థులకు పోలైతే గెలుపుపై కచ్చితంగా ప్రభావం చూపుతుందని భావిస్తున్నారు. ఎందుకంటే నలుగురైదుగురు స్వతంత్రులుంటే ఈవీఎంలో అభ్యర్థుల పేర్లు, వారి గుర్తులను ఓటర్లు తేలిగ్గా గుర్తుంచుకుంటారు. ఇందుకు భిన్నంగా శివారులోని 11 నియోజకవర్గాల్లో 20 మందికిపైగా బరిలో ఉన్నారు. కారు, కమలం, హస్తాలను పోలిన గుర్తులు స్వతంత్రులకు కేటాయిస్తే ప్రధాన పార్టీల అభ్యర్థులకు ఇబ్బందులు పెరిగే అవకాశాలున్నాయి.

# ఎన్నికల వేళ.. ఆరోగ్యం జర జాగ్రత్త

హైదరాబాద్: ఎన్నికల వేళ నేతలంతా ప్రచారంలో మునిగి తేలుతున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రజల మధ్యే గడుపుతున్నారు. ఈ క్రమంలో కొందరు ఆరోగ్యాన్ని సైతం పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేస్తుంటారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పాదయాత్రలు, ప్రచారాల్లో తిరగడం వల్ల చెమట రూపంలో శరీరంలోని నీరంతా పోయి డీహైడ్రేషన్ ముప్పు పొంచి ఉండే ప్రమాదం ఉందని వైద్య నిపుణులు చెబుతున్నారు.ప్రచారంలో భాగంగా ఎక్కువ సేపు బయట తిరగడంతో నీరసం, నాలుక తడారిపోవడం, మూత్రం రంగుమారడం లాంటి లక్షణాలు కన్పిస్తే.. నీళ్లు మాత్రమే కాకుండా ఓఆర్ఎస్, ఉప్పు, చక్కెర కలిపి మజ్జిగ, కొబ్బరి నీళ్లు లాంటివి తీసుకుంటే శరీరం కోల్పోయిన ఎలక్ట్రోలైట్స్ తిరిగి భర్తీ చేయవచ్చు. అధిక రక్తపోటు, మధుమేహం తదితర దీర్ఘకాలిక రోగాలతో ఇబ్బందిపడే వారు మరింత జాగ్రత్తగా ఉండాలి. ప్రచారంలో పాల్గొనే వాళ్లు శరీరం డీహైడ్రేట్ కాకుండా కొబ్బరి నీళ్లు, మజ్జిగ, నిమ్మరసం, ఓఆర్ఎస్ తీసుకోవాలి.ఆహారంపై అశ్రద్ధ వద్దు–డాక్టర్ రఘు డీకే, గ్యాస్ట్రోఎంటరాలజిస్టు, అపోలో ఆసుపత్రిఅభ్యర్థులతోపాటు వారి




అనుచర వర్గం ఎక్కువ సమయం బయటే తిరుగుతుంటారు. ప్రచారంలో భాగంగా చాలామంది కాఫీలు, టీలు ఎక్కువగా తీసుకుంటారు. దీంతో జీర్ణకోశ వ్యాధులు పెరిగే ముప్పు ఉంటుంది.

మధుమేహం, అధిక రక్తపోటు ఉంటే మరింత అప్రమత్తంగా ఉండాలి. ఇలాంటి వారు వైద్యులు సూచించిన మందులన్నీ వేసుకోవాలి. ప్రచారం తర్వాత చూద్దాంలే అనుకుంటే అది తీవ్ర ముప్పునకు దారి తీస్తుంది.అధిక కేలరీలు, చక్కెరఉన్న ఆహార పదార్థాలకు దూరంగా ఉండాలి. ఇప్పటికే ఈ రెండు వ్యాధులుంటే.. ఉదయం, సాయంత్రం తప్పనిసరిగా బీపీ, మధుమేహ పరీక్షలు చేసుకోవాలి.

ఉదయం అల్పాహారం తప్పకుండా తీసుకోవాలి. మధ్యాహ్న భోజనంలో ఆకుకూరలు, కాయగూరలు, పండ్లు ఇతర డ్రైఫ్రూట్స్, ఎక్కువ పీచుఉండే పదార్థాలు తీసుకోవాలి. సలాడ్‌తో శరీరానికి చల్లదనం ఉంటుంది. ఆహారంపై అశ్రద్ధ చేస్తే మధుమేహ రోగులకు షుగర్ స్థాయిలు పడిపోయి.. ఆ ప్రభావం అవయవాల పనితీరుపై పడుతుంది. సమయానికి తేలికపాటి ఆహారం తీసుకుంటే మేలు చేస్తుంది.

# ఇంటి వద్దే ఓటేస్తాం



సిరిసిల్ల : అసెంబ్లీ ఎన్నికల్లో శతశాతం పోలింగ్ లక్ష్యంగా ఎన్నికల అధికారులు సంస్కరణలతో ముందుకు సాగుతున్నారు. ప్రజల్లో అవగాహన పెంచేందుకు వినూత్న కార్యక్రమాలకు శ్రీకారం చుడుతున్నారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకునేందుకు చర్యలు చేపడుతున్నారు. కదల్లేని పరిస్థితుల్లో ఉన్న వృద్ధులు, దివ్యాంగులు తమ ఓటు హక్కును ఇంటి నుంచే వినియోగించుకునేందుకు ఈసారి అవకాశం కల్పించారు.జిల్లాలో 4,66,677 మంది ఓటర్లు ఉండగా అందులో 80 ఏళ్లు పైబడిన వృద్ధులు 8,499, దివ్యాంగులు 11,479, సర్వీసు ఓటర్లు 157 మంది ఉన్నారు. దివ్యాంగులు పోలింగ్ కేంద్రానికి వచ్చి ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఇబ్బంది పడుతున్నారని ఎన్నికల సంఘం గుర్తించింది. ఇంటి వద్దే ఓటు వేసే అవకాశాన్ని కల్పించింది. గతంలో కేంద్ర, ఎన్నికల విధుల్లో ఉండే రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు మాత్రమే పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కల్పించింది. తొలిసారిగా రాష్ట్రంలో ఇంటి నుంచే ఓటేసేందుకు ఎన్నికల సంఘం అవకాశం కల్పించింది. 80 ఏళ్లు దాటిన వృద్ధులు, 40 శాతం పైగా అంగవైకల్యమున్న దివ్యాంగులకు వెసులుబాటు కల్పించింది. ఇందుకోసం ఈ నెల 7 వరకు ఫారం–12డి ద్వారా దరఖాస్తులు స్వీకరించారు. గడువులోగా అందిన దరఖాస్తులను అధికారులు పూర్తిస్థాయిలో పునఃపరిశీలించి, క్షేత్రస్థాయిలో సందర్శన తర్వాత వేములవాడ నియోజకవర్గంలో 539 మంది, సిరిసిల్ల నియోజకవర్గం పరిధిలో 450 మందివి రిటర్నింగ్ అధికారులు ఆమోదించారు. వారి వివరాలను అన్ని రాజకీయ పార్టీలతోపాటు అభ్యర్థులకు అందించారు. ఊరిలో పోలింగ్ బృందం ఎప్పుడు సందర్శనకు వచ్చేది వెల్లడించారు. ఈ నెల 21 నుంచి 25 వరకు బృందాలు దరఖాస్తు చేసుకున్న ఓటర్ల ఇంటికి వెళ్లనున్నాయి. పోస్టల్ బ్యాలెట్‌తో రహస్య ఓటింగ్‌కు ఏర్పాట్లు చేస్తున్నారు. ఒక్కో పోలింగ్ బృందంలో ఒక ప్రిసైడింగ్ అధికారి, ఒక పోలింగ్ అధికారి, పోలీసు సిబ్బంది, సూక్ష్మ పరిశీలకులు ఉంటారు. ఈ ప్రక్రియ అంతా వీడియో చిత్రీకరణ చేయనున్నారు. ఈసారి పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటేసేందుకు కొత్తగా 1,028 మందికి అవకాశం కలిగింది.

మరికొన్ని శాఖలకు...సర్వీసు ఓటర్లు 157 మంది ఉండగా, ఈ సారి ఎన్నికల విధుల్లో ఉండే అత్యవసర సేవల విభాగం ఉద్యోగులను ఈ జాబితాలో చేర్చింది. ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ), భారతీయ రైల్వే, ఆర్టీసీ, బీఎస్ఎన్ఎల్, ఎఫ్‌సీఐ, ఏఐఆర్, దూరదర్శన్, విద్యుత్తు, వైద్య, పౌర సరఫరాలు, అగ్నిమాపకశాఖతోపాటు ఎన్నికల సంఘం ధ్రువీకరించిన జర్నలిస్టులు ఈ విభాగంలో ఉంటారు. రెండు నియోజకవర్గాల్లో ఆయా శాఖలకు చెందిన 39 మంది వినియోగించుకోనున్నారు. పోలింగ్‌కు రెండు రోజుల ముందు బ్యాలెట్ జారీ చేయనున్నట్లు సమాచారం.

దివ్యాంగులు ఇబ్బంది పడొద్దని...దివ్యాంగులు పోలింగ్ కేంద్రాలకు వెళ్లాలంటే వాహనంతోపాటు సహాయకులు తప్పనిసరి. ఎన్నో ప్రయాసలతో వాహనం ఎక్కించినది మొదలు కేంద్రానికి వెళ్లే వరకు వారికి తిప్పలు తప్పవు. పూర్తిగా కదల్లేని స్థితిలో ఉన్న వారికి ప్రస్తుతం ఇంటి వద్దే ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. కేంద్రాలకు వచ్చే వృద్ధులు, దివ్యాంగులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపడుతున్నారు. 311 కేంద్రాలను గుర్తించిన అధికారులు చక్రాల కుర్చీలను సమకూర్చనున్నారు. ఇప్పటికే 316 చక్రాల కుర్చీలు అందుబాటులో ఉన్నాయి. వీటిని ఈ నెల 28 వరకు ఆయా కేంద్రాలకు తరలించనున్నారు.

# శ్రామిక వర్గం.. పోరులో కీలకం



జగిత్యాల : శాసనసభ ఎన్నికల్లో వివిధ వర్గాల కార్మికులు కీలకంగా మారారు. ఉమ్మడి జిల్లాలోని పలు నియోజకవర్గాల్లో అధిక సంఖ్యలో ఉన్న సింగరేణి, చేనేత, గల్ఫ్, బీడీ కార్మికుల ఓటర్లను ప్రసన్నం చేసుకునే పనిలో అన్ని పార్టీలు నిమగ్నమయ్యాయి. వారి సమస్యల పరిష్కారానికి హామీలు ఇస్తూ మద్దతు కూడగట్టుకునే ప్రయత్నం చేస్తున్నాయి. దాదాపు 7 నియోజకవర్గాల్లో గెలుపోటములను కార్మికులు ప్రభావితం చేయనున్నారు.

ప్రచారంలో బీడీ కార్మికుల ప్రస్తావన

ఉమ్మడి జిల్లాలో వేలల్లో బీడీ కార్మిక కుటుంబాలున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుతం కార్మికులకు, టేకేదార్లకు పింఛను అందిస్తోంది. పీఎఫ్ కటాఫ్ తేదీ తొలగించి కార్మికులందరికీ పింఛను వర్తింపజేయాలన్న డిమాండ్‌కు ముఖ్యమంత్రి కేసీఆర్ ఇటీవలి సభల్లో సానుకూలంగా స్పందించారు. కాగా తామే కార్మికుల సమస్యలు పరిష్కరిస్తామని, ఇళ్లు కూడా నిర్మించి ఇస్తామని కాంగ్రెస్ నాయకులు హామీ ఇస్తున్నారు. భాజపా నాయకులు కూడా వారి సమస్యలనే ప్రచారంలో ఎక్కువగా ప్రస్తావిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో బీడీ కార్మికులు 2,09,440 మంది, టేకేదార్లు, ప్యాకర్లు, ఇతరులు 47,559 మంది ఉన్నారు. జగిత్యాల, కోరుట్ల, ధర్మపురి, వేములవాడ, చొప్పదండి, సిరిసిల్ల, కరీంనగర్ నియోజకవర్గాల్లో వీరి ప్రభావం ఉంటుంది.

సింగరేణి.. ఓట్ల గని

సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో పెద్దపల్లి జిల్లాలో రామగుండం 1, 2, 3 డివిజన్లున్నాయి. రామగుండం, మంథని నియోజకవర్గాల్లో కలిసి 10 వేల మంది కార్మికులున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 42,092 మంది ఉంటే నాలుగో వంతు ఇక్కడే ఉండటం విశేషం. సింగరేణి కార్మికుల మద్దతు కోసం అన్ని పార్టీలు ప్రయత్నాలు ముమ్మరం చేశాయి. కార్మికులకు లాభాల్లో వాటా, బోనస్ పెంచుతామని భారాస ప్రకటించింది. వేజ్‌బోర్డ్ బకాయిలు చెల్లిస్తామని, వారసులకు ఉద్యోగాలు ఇస్తామని ఆ పార్టీ నాయకులు చెబుతున్నారు. తమ ప్రభుత్వమే సంస్థ లాభాల్లో అత్యధికంగా 32 శాతం బోనస్ ఇచ్చిన అంశాన్ని ప్రస్తావిస్తున్నారు. ఇక కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్‌గాంధీ సింగరేణి సంస్థ ప్రైవేటీకరణను అడ్డుకుంటామని ప్రకటించారు. భాజపా కూడా తాము ప్రైవేటీకరణ చేయబోమంటూ వారిని ప్రసన్నం చేసుకోవడానికి యత్నిస్తోంది.

నేతన్నల ప్రాపకానికి పాట్లు

గతంలో కోరుట్ల, మెట్‌పల్లి, సిరిసిల్ల, కరీంనగర్ ప్రాంతాల్లో వినిపించిన చేనేత మగ్గాల సడి నేడు తగ్గింది. రాజన్న సిరిసిల్ల జిల్లాలో 12 సంఘాల పరిధిలో సుమారు 3 వేల మంది ఉపాధి పొందుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 49 వేల మంది మరమగ్గాలపై ఉపాధి పొందుతుండగా రాజన్న సిరిసిల్ల జిల్లాలో 35 వేల మంది ఉన్నారు. గతంలో నేతన్నలు వివిధ సమస్యలతో ఆత్మహత్యలకు పాల్పడగా తెలంగాణ ఆవిర్భావం తర్వాత భారాస ప్రభుత్వం పలు పథకాలు అమలు చేస్తోంది. తమ పథకాలను వివరిస్తూ భారాస కార్మికుల మద్దతు కోరుతోంది. కార్మికుల ప్రయోజనాలపై ప్రత్యర్థి పార్టీలు, వారి ప్రభుత్వాలు పట్టించుకోలేదని, తమను ఆదరిస్తే సమస్యలు పరిష్కరిస్తామని కాంగ్రెస్, భాజపా నాయకులు చెబుతున్నారు. చేనేతపై కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ రద్దు చేయాలనే డిమాండ్ ఉంది. ఉమ్మడి జిల్లాలో సిరిసిల్ల, చొప్పదండి, వేములవాడ నియోజకవర్గాల్లో నేతకార్మికుల ప్రభావం ఉంటుంది.

గల్ఫ్ గోస వింటున్నారు

ఉమ్మడి జిల్లాలో గల్ఫ్ తెలియని గడప లేదంటే అతిశయోక్తి కాదు. 1980లో మొదలైన వలసల ప్రస్థానం ఇప్పటికీ కొనసాగుతోంది. తెరాస అధికారంలోకి వచ్చాక గల్ఫ్ సహా ఇతర దేశాల ప్రతినిధులను హైదరాబాద్‌కు ఆహ్వానించారు. నాటి సమావేశంలో మంత్రి కేటీఆర్ పాల్గొని తాము గల్ఫ్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ప్రకటించారు. ఇక కాంగ్రెస్ ఈ ఎన్నికల్లో గల్ఫ్ సమస్యలను ప్రస్తావిస్తూ తాము అధికారంలోకి వస్తే సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇస్తోంది. తమ పార్టీ ఆధ్వర్యంలో ప్రత్యేక విభాగం ఏర్పాటు చేశామని చెబుతోంది. భాజపా కూడా ఎన్నికల ప్రచారంలో గల్ఫ్ సమస్యలను ప్రస్తావిస్తోంది. గల్ఫ్ బోర్డు ఏర్పాటు చేస్తామని కోరుట్ల అభ్యర్థి ధర్మపురి అర్వింద్ ప్రచారంలో చెప్పారు. మరోవైపు తామే ఎన్నికల బరిలో ఉంటామని ప్రకటించిన గల్ఫ్ సంఘాలు సిరిసిల్ల, వేములవాడ, కోరుట్ల, ధర్మపురి నియోజకవర్గాల్లో అభ్యర్థులను పోటీలోకి దింపాయి. ఉమ్మడి జిల్లా నుంచి దాదాపు 3.5 లక్షల మంది గల్ఫ్ వెళ్లగా జగిత్యాల, కోరుట్ల, వేములవాడ, రాజన్న సిరిసిల్ల, ధర్మపురి, చొప్పదండి, కరీంనగర్ నియోజకవర్గాల్లో వీరి ప్రభావం ఉంటుంది.

# సంఘాల మద్దతు దక్కేదెలా?

పెద్దపల్లి: ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు అభ్యర్థులు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. గెలుపే లక్ష్యంగా వ్యక్తిగతంగా ఓటర్లను కలవడంతోపాటు సంఘాలతో ఆత్మీయ సమ్మేళనాలు ఏర్పాటు చేస్తూ వారి మద్దతు కోరుతున్నారు. ఈ క్రమంలో మహిళా సంఘాలను ప్రసన్నం చేసుకోవడంపై నేతలు మరింత కసరత్తు చేస్తున్నారు. మహిళా సంఘాల సానుకూలత ఉంటే వారి మద్దతు దొరకడంతోపాటు గ్రామాల్లో, కాలనీల్లో వారి ద్వారా చుట్టుపక్కల వారిని ప్రభావితం చేసే అవకాశం ఉండటంతో అభ్యర్థులు వీరి మద్దతుపై ప్రత్యేక దృష్టి పెడుతున్నారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా మొత్తం 1,955 గ్రామ సంఘాలు, 49,420 స్వయం సహాయక సంఘాలుండగా 5,44,968 మంది సభ్యులున్నారు. ఇప్పటికే భారాస, కాంగ్రెస్, భాజపా అభ్యర్థులు వీరికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తూ మద్దతును కూడగట్టేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు.హామీలు గుప్పిస్తూ..ఎక్కువ మంది సభ్యురాళ్లు ఉన్న బృందాలకు నేతలు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారు. వారి డిమాండ్లకు అనుగుణంగా హామీలూ గుప్పిస్తున్నారు. తాము సూచించిన అభ్యర్థికి



మద్దతుగా నిలబడటమే కాకుండా వారి బంధుమిత్రుల ఓట్లను కూడా పొందేలా పర్యవేక్షించాలని కోరుతున్నారు. కొందరు వ్యక్తిగత హామీలు కోరుతుండగా.. మరికొందరు గ్రామాల్లో తమకు ప్రత్యేకంగా భవనాలు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తులు చేస్తున్నారని సమాచారం. దీనికి నాయకులు కూడా ఒప్పుకొంటూ వారి మద్దతు కూడగట్టుకుంటున్నారు. ఈ క్రమంలో కొన్ని సంఘాల మహిళలు బహిరంగంగా ముందుకు వచ్చి మద్దతు ఇస్తుండగా.. ఇంకొన్ని సంఘాల వారు అంతర్గతంగా మద్దతు ఇస్తామని చెబుతున్నారు.

# రాజన్నకు కార్తీక శోభ

వేములవాడ: కార్తిక మాసంలో సూర్యోదయానికి ముందు పుష్కర స్నానాలు, వ్రతాలు, నోములు, ఉపవాసాలు, దీపారాధనలు, శుభకార్యాలకు ఎంతో ముఖ్యమైనది కావడంతో ఈనెల మొత్తం పరమ పవిత్రంగా భక్తులు, ప్రజలు కొలుస్తుంటారు. శివకేశవులకు ప్రీతిపాత్రమైన మాసం కావడంతో శివాలయాల్లో ప్రత్యేక పూజలు, దీపారాధన చేస్తుంటారు. దీంతో ఆలయాలు భక్తులతో కిటకిటలాడుతుంటాయి. ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వేములవాడలోని శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయంలో కార్తిక మాసం వేడుకలు ఆరంభం కావడంతో ఆలయంలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. ఆలయాన్ని విద్యుత్తు దీపాలతో అందంగా అలంకరించారు. డిసెంబరు 12 వరకు ఈ వేడుకలు కొనసాగనున్నాయి. ఈ నెలలో ప్రత్యేక పర్వ దినాల్లో స్వామివారికి, అనుబంధ ఆలయాల్లోని పరివార దేవతలకు ప్రతి సోమవారం ప్రత్యేక అభిషేక పూజలు, లింగార్చన నిర్వహించడం జరుగుతుంది. ఈ సందర్భంగా భక్తుల సౌకర్యార్థం ప్రతి సోమవారం, ఏకాదశి రోజుల్లో సత్యనారాయణస్వామి వ్రతాలు రెండు పర్యాయాలు నిర్వహించనున్నారు. ఈ నెల 24న కార్తిక శుద్ధ ద్వాదశి రోజున రుక్మిణి విఠలేశ్వరస్వామికి పంచోపనిషత్తుల ద్వారా అభిషేకం, సాయంత్రం తులసీ కల్యాణం నిర్వహించనున్నారు. 25న శుద్ధ త్రయోదశి, వైకుంఠ చతుర్దశి సందర్భంగా అనంత పద్మనాభస్వామికి పంచోపనిషత్తుల ద్వారా అభిషేకం చేయనున్నారు. సాయంత్రం శ్రీ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి మహాపూజ, పొన్నచెట్టు సేవ నిర్వహించనున్నారు. 27న కార్తిక పౌర్ణమి రోజున స్వామివారికి 11 మంది



రుత్విజులచే మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం వైభవంగా నిర్వహించనున్నారు. రాత్రి జ్వాలాతోరణ పూజ జరపనున్నారు. ఈ నెల రోజుల పాటు ఆలయంలోని స్వామివారి కల్యాణ మండపంలో కార్తిక పురాణ ప్రవచనాలు ఉంటాయని అధికారులు వెల్లడించారు.'

మహిళల దీపారాధన...


కార్తిక మాసం మొత్తం మహిళలు అత్యంత పరమ పవిత్రంగా కొలుస్తుంటారు. ఈ నెలలో శివనామ స్మరణ చేస్తూ దీపారాధన చేస్తారు. 365 వత్తులతో శివుడికి దీపారాధన చేస్తే పాపాలు నశించి పుణ్యం లభిస్తుందని భక్తుల విశ్వాసం. ఈ మాసంలో అయిదు రోజుల్లో ఏకాదశి నాడు ఉపవాసం, ద్వాదశినాడు తులసీ వివాహం, వైకుంఠ చతుర్ది నాడు ఉసిరి చెట్టుకింద దీపారాధన చేయడం పవిత్రంగా భావిస్తుంటారు. విష్ణుమూర్తికి ఇష్టమైన పౌర్ణమి రోజు స్నానాలు ఆచరించి సత్యనారాయణస్వామి వ్రతాలు నిర్వహిస్తారు. కార్తికంలో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలతోపాటు ఇతర రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకొని దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకోనున్నారు.

# పోల్ చిట్టీలతో ఓటు చైతన్యం

పెద్దపల్లి : 'ఓటర్లకు విజ్ఞప్తి.. ఎటువంటి ప్రలోభాలకు లొంగకుండా, నైతికంగా, నిర్భయంగా ఓటేయండి. ఎన్నికల ప్రవర్తనా నియమావళి, వ్యయ ఉల్లంఘన జరిగితే సీ–విజిల్‌కు ఫిర్యాదు చేయండి'. ఇదేదో వాణిజ్య ప్రకటన కాదండి. పోలింగ్ శాతం పెంచి, సమర్థమైన ఎన్నికల నిర్వహణకు కేంద్ర ఎన్నికల సంఘం ముద్రించిన కర పత్రాల్లోని సందేశం. పోల్ చిట్టీలతో పాటు ఈ సారి మూడు పేజీల కర పత్రాలను ఓటర్లకు పంపిణీ చేసేందుకు రంగం సిద్ధం చేశారు. ఎన్నికల్లో పోలింగ్ శాతం తగ్గడంతో చివరి ప్రయత్నంగా ఈ విధానానికి తెరతీశారు. ద్వారా చైతన్యం చేయాలని భావిస్తున్నారు.

మూడు రకాల పత్రాల ముద్రణ

ఓటర్లను చైతన్యం చేయడానికి, ప్రతి ఒక్కరినీ ఓటింగ్‌లో పాల్గొనేలా చేయడమే కర పత్రాల ఉద్దేశం. ఓటు ప్రాముఖ్యాన్ని, దేశ భవిష్యత్తును మార్చే శక్తి ఓటుకు మాత్రమే ఉందని ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చే సందేశంతో సీ.విజిల్ యాప్, 1950 టోల్‌ఫ్రీ నంబర్, ఓటరు గైడ్ ఇలా మూడు రకాల కర పత్రాలను ముద్రించారు. ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరికీ వీటిని అందించేందుకు అన్ని రకాల ఏర్పాట్లు పూర్తి చేశారు. మద్యానికి, డబ్బులకు, బహుమతులకు ఓటును అమ్ముకోకుండా స్వేచ్ఛగా ఓటును వినియోగించుకుని మంచి నాయకులను ఎన్నుకోవాలనే భావన కలిగిస్తున్నారు.



కేంద్రానికి చేరేలా గూగుల్ మ్యాప్

తమ ఓటు ఏ పోలింగ్ కేంద్రంలో ఉందో తెలియక ఓటర్లు హైరానా పడుతున్నారు. ఒక చోటుకు వెళితే మరో చోట అంటూ ఓటేసేందుకు పోలింగ్ కేంద్రాల చుట్టూ తిరుగుతున్నారు. ఇలాంటి సమస్యలకు తావులేకుండా నేరుగా పోలింగ్ కేంద్రానికి చేరేందుకు ఓటరు స్లిప్పు వెనక భాగంలో పోలింగ్ కేంద్రం గూగుల్ మ్యాప్ రూపొందించారు. నియోజకవర్గం, పోలింగ్ కేంద్రం పేరు, బీఎల్‌వో చరవాణి నంబరు ముద్రించారు. ఓటేసేందుకు ఈ పోల్ చిట్టీతో పాటు ఎన్నికల సంఘం ప్రవేశ పెట్టిన 12 రకాల గుర్తింపు కార్డులలో ఏదైనా ఒకదానిని వెంట తీసుకెళ్లాలని ఇందులో పొందుపరిచారు.

మండలాలకు తరలింపు

ఉమ్మడి జిల్లాలోని 12 నియోజకవర్గాల్లో 29,38,424 ఓటర్లు ఉన్నారు. ప్రతి ఓటరుకు పోల్ చిట్టీలు పంపిణీ చేసేందుకు నియోజకవర్గ కేంద్రాల నుంచి మండలాలకు తరలిస్తున్నారు. పోల్ చిట్టీలతో పాటు ఓటు చైతన్య కర పత్రాలను రెవెన్యూ అధికారుల పర్యవేక్షణలో బీఎల్‌వోలు ఇంటింటికి వెళ్లి ఓటర్లకు పంపిణీ చేయనున్నారు.

# పోక్సో.. బాలికలకు అభయం!!

వరంగల్ : పోక్సో చట్టం.. బాలికలకు అండగా ఉంటుంది. స్వేచ్ఛాయుత జీవితానికి అభయమిస్తుంది..వేధింపులకు పాల్పడేవారి తాట తీస్తుంది.. కామాంధుల పట్ల కఠినంగా వ్యవహరిస్తుంది.. అఘాయిత్యాలకు పాల్పడే వారిని జైలుకు పంపుతుంది. ఇటీవల ఉమ్మడి వరంగల్ జిల్లాలో బాలికలపై ఆగడాలు పెరిగిపోతున్నాయి. చిన్న పిల్లలకు బిస్కెట్, చాక్లెటు ఇస్తామని, బొమ్మలు కొనిస్తామని చెప్పి.. లైంగిక దాడులకు పాల్పడటం ఆందోళన కలిగించే విషయం. ఇందులో ఎక్కువగా తెలిసిన వారు, దగ్గరి బంధువులు ఉంటున్నారు. వీటికి అడ్డుకట్ట వేయడానికి కేంద్ర ప్రభుత్వం 2012లో పోక్సో చట్టాన్ని తీసుకొచ్చింది. అయినప్పటికీ లైంగిక దాడులు ఆగడం లేదు. ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా ఏదో ఒక చోట ఇలాంటి ఘటనలు వెలుగు చూస్తూనే ఉన్నాయి.

ప్రత్యేక కోర్టులు పోక్సో కేసుల విచారణకు ప్రభుత్వం ప్రత్యేక కోర్టులు ఏర్పాటు చేసింది. పోలీసులు 60 రోజుల్లో విచారణ పూర్తి చేసి కోర్టులో అభియోగపత్రాలు దాఖలు చేయాలి. సకాలంలో న్యాయం జరిగే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలో ప్రత్యేకంగా పోక్సో కోర్టు ఉంది. బాధితులకు భరోసా కేంద్రంలో రక్షణ కల్పించి ఆన్‌లైన్‌లో విచారించే అవకాశం ఉంటుంది. వారిని ప్రత్యేక ద్వారాల్లో లోపలికి తీసుకెళ్తారు. వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలోని హనుమకొండ ఠాణా పరిధిలో తొమ్మిది నెలల చిన్నారిపై అత్యాచారం జరిగింది. దీనిపై సమగ్ర విచారణ జరిపిన పోలీసులు కోర్టులో అభియోగపత్రాలు దాఖలు చేశారు. కోర్టులో నేరం రుజువు కావడంతో నిందితుడికి జీవిత ఖైదు పడింది.

చట్టం ఏం చెబుతుందంటే?

2012లో దిల్లీలోని బస్సులో బాలికపై కొంతమంది అత్యాచారం చేశారు. అప్పటి ప్రభుత్వం బాలికలపై అత్యాచారాలు, వేధింపులను నిరోధించేందుకు పార్లమెంట్‌లో పోక్సో చట్టం తెచ్చింది. ఉద్దేశపూర్వకంగా లైంగిక దాడి, వేధింపులకు పాల్పడితే అత్యాచారం,



వేధింపుల చట్టంతో పాటు పోక్సో కేసును పోలీసులు నమోదు చేస్తారు. బాలిక ( 18 ఏళ్లలోపు)ల రక్షణ కోసం ప్రత్యేకంగా ఈ చట్టాన్ని రూపొందించారు.

బాలికలపై పదేపదే అత్యాచారం చేస్తే ఐపీసీ 376తో పాటు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి ఏసీపీ విచారణ జరుపుతారు. నేరం రుజువు అయితే పదేళ్లు లేదా అంతకంటే ఎక్కువ జైలు శిక్ష పడుతుంది. వేధింపులకు గురిచేస్తే 354 (నిర్భయ) చట్టంతో పాటు పోక్సో కేసు నమోదుచేసి ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారి విచారణ జరుపుతారు. నేరం రుజువైతే రెండు నుంచి ఏడు సంవత్సరాలు జైలు శిక్ష పడుతుంది.

ఈ ఏడాది మే 15 వరకు కేసులు నమోదు ఇలా..

వరంగల్ పోలీసు కమిషనరేట్ - 24

మహబూబాబాద్ : 21

ములుగు : 10

భూపాలపల్లి: 6

ఇలా ఫిర్యాదు చేయాలి

అత్యాచారానికి గురైన సమయంలో బాలిక తల్లిదండ్రులు నేరుగా సంబంధిత ఠాణాలకు వెళ్లి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేస్తే పోలీసులు కేసు నమోదుచేస్తారు. డయల్ 100కు కాల్ చేస్తే పోలీసులు స్వయంగా వెళ్లి.. ఫిర్యాదు తీసుకొని ఠాణాకు వచ్చి కేసు నమోదుచేస్తారు. ఆసుపత్రులు, కోర్టుల్లో కూడా బాధితులు ఫిర్యాదు చేయవచ్చు.%ncpcr.gov.in% వెబ్‌సైటులోని ఈ- బాక్సులోనూ ఫిర్యాదు చేయవచ్చు. బాధిత బాలికలకు ప్రభుత్వం అన్ని విధాలుగా రక్షణ కల్పిస్తుంది. మహిళా పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చి మనోధైర్యాన్ని కల్పిస్తారు. ప్రభుత్వం నుంచి పరిహారం కూడా అందిస్తారు.

అవగాహన ఉండాలి

చల్లా శ్రీనివాస్, న్యాయవాది

చట్టంపై అవగాహన ఉండాలి. కోర్టులో నేరం రుజువైతే కఠిన శిక్షలు పడతాయి. సాక్షులను సకాలంలో ప్రవేశపెడితే నిందితులకు శిక్షలు పడి అత్యాచారాలు, వేధింపులు తగ్గుతాయి.

ప్రత్యేక దృష్టి సారించాం

రంగనాథ్, వరంగల్ పోలీస్ కమిషనర్

పోక్సో కేసులపై ప్రత్యేక దృష్టి సారించాం. ఫిర్యాదు అందిన వెంటనే కేసు నమోదు చేస్తాం. బాధితులను భరోసా కేంద్రానికి తరలించి, వారికి అన్ని రకాల వసతులు కల్పిస్తాం. వైద్యం, న్యాయ సలహాలు అందిస్తాం. కేసు విచారణ వేగంగా చేస్తాం. కోర్టులో అభియోగపత్రాన్ని దాఖలు చేసిన తర్వాత బాధిత బాలిక సాక్ష్యం చెబితే శిక్ష పడుతుంది.

# కట్టకు గండి కొట్టిందెవరు?

వరంగల్ : భద్రకాళి చెరువు కట్టకు ఎవరు గండికొట్టారు.. దీని వెనుక ఎవరున్నారు.. క్షేత్రస్థాయిలో పరిశీలించిన తగిన నివేదిక ఇవ్వాలని మేయర్ గుండు సుధారాణి, కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా పట్టణ ప్రణాళిక విభాగం అధికారులను ఆదేశించారు. హనుమకొండ పద్మాక్షిగుట్ట రోడ్డు నుంచి హంటర్‌రోడ్ పాత ఆర్టీసీ టైర్ల కంపెనీ వరకు ఫోర్‌షోర్ బండ్ ఉంది. 15- 20 అడుగుల వెడల్పు ఉంటుంది. హంటర్‌రోడ్ నుంచి పద్మాక్షిగుట్ట వైపు వచ్చేందుకు కచ్చా రోడ్డు ఉంది. కట్టను తెంపడంతో రాకపోకలు ఆగాయి. న్యూశాయంపేట వైపు నుంచి వచ్చే మురుగు నీరంతా భద్రకాళి చెరువులోకి వెళ్తోంది. కొన్నేళ్లుగా భద్రకాళి చెరువు మినీ బండ్ కోసం పైరవీలు నడుస్తున్నాయి. గత నెలలో రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు అధికారుల కమిటీ క్షేత్రస్థాయిలో పరిశీలన చేసింది. భారత అత్యున్నత న్యాయస్థానం జారీ చేసిన ఫుల్ ట్యాంకు లెవల్(ఎఫ్‌టీఎల్), వరంగల్ నూతన బృహత్ ప్రణాళిక జోనింగ్ నిబంధనల ప్రకారం మినీ బండ్ సాధ్యం కాదని అధికారులు తేల్చారు. ఇందుకు సంబంధించిన నివేదికను హనుమకొండ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ పంపించారు.

# పదండి ముందుకు.. పదండి సాగుకు



ఖమ్మం : 'వానాకాలం' సీజన్‌కు వ్యవసాయశాఖ సిద్ధమవుతోంది. ఈ సీజన్‌లో సాగు చేయాల్సిన పంటల గురించి ఈనెల 31 వరకు 'రైతు అవగాహన' కార్యక్రమాలను నిర్వహించనుంది. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో గ్రామాల వారీగా అధికారులు షెడ్యూల్ తయారు చేశారు. ప్రధానంగా ఇక్కడి పత్తికి విదేశాల్లో డిమాండ్ ఉండటంతో పంట విస్తీర్ణం పెంచేలా సూచనలు చేస్తున్నారు. నూనె గింజల పంట (ఆయిల్‌పామ్) సాగు విస్తీర్ణం పెంచేలా అవగాహన కల్పిస్తున్నారు. పంట కాలాన్ని ముందుకు తీసుకురావటం ద్వారా ప్రకృతి వైపరీత్యాల నుంచి గట్టేక్కేలా చైతన్యపరుస్తున్నారు. సీజన్‌కు ముందు జిల్లాల్లోకి నకిలీ విత్తనాలు రాకుండా అవసరమైన చర్యలు చేపడుతున్నారు. గత ఏడాది పంటల సాగు సరళిని బట్టి ఈసారి రైతులకు వ్యవసాయశాఖ ద్వారా తగిన సలహాలు, సూచనలు అందిస్తారు. రైతు వేదికలను పూర్తిస్థాయిలో వినియోగించుకునేందుకు ఏర్పాట్లు చేశారు.

ఖమ్మం జిల్లాలో...ప్రస్తుతం మిరప పంటకు ఉన్న డిమాండ్ దృష్ట్యా ఈసారి విస్తీర్ణం బాగా పెరుగొచ్చు. పత్తి, మొక్కజొన్న ధరలు ఆశాజనకంగా లేకపోవటంతో రైతులు ఆ పంటల సాగుకు కాస్త విముఖత చూపుతున్నారు. అపరాల విస్తీర్ణమూ పెరిగే అవకాశముంది. ఈ సీజన్‌లో అన్ని పంటలు కలిపి 6,16,067 ఎకరాల్లో సాగవుతాయని వ్యవసాయశాఖ అంచనా వేసింది. ఆయిల్‌పామ్ విస్తీర్ణం గణనీయంగా పెరుగుతుందని భావిస్తోంది.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో...

పత్తి పంటకు విదేశాల్లో డిమాండ్ ఉన్న నేపథ్యంలో సాగు విస్తీర్ణం పెంచాలని వ్యవసాయశాఖ భావిస్తోంది. గతేడాది 1,62,100 ఎకరాల్లో సాగు చేయగా ఈసారి 2,14,302 ఎకరాలకు విస్తరించేలా ప్రణాళిక తయారు చేశారు. అన్నపురెడ్డిపల్లి, అశ్వారావుపేట, భద్రాచలం, బూర్గంపాడు, చంద్రుగొండ, దమ్మపేట, దుమ్ముగూడెం, గుండాల, జూలూరుపాడు, కరకగూడెం, ములకలపల్లి, పాల్వంచ, సుజాతనగర్, టేకులపల్లి, ఇల్లెందు మండలాల్లో సాగు విస్తీర్ణం పెరిగే అవకాశం ఉంది. గతేడాది కంది పంటను 6,288 ఎకరాల్లో సాగు చేశారు. ఈసారి 9,300 ఎకరాల్లో పండించేలా అధికారులు ప్రణాళిక తయారుచేశారు. గతేడాది వర్షాకాలంలో 1,64,266 ఎకరాల్లో వరి సాగవగా ఈసారి 1,65,025 ఎకరాల్లో పండించాలని భావిస్తున్నారు. చైతన్యం కల్పించే అంశాలు పచ్చిరొట్ట పైర్ల సాగుకు ప్రాధాన్యం.లి విడతల వారీగా యూరియా వాడకం.లి భాస్వరం కరిగించే బ్యాక్టీరియా వాడకంలి విత్తనాలను అధీకృత డీలర్ల నుంచి కొని రసీదు పొందటం.

హెచ్‌టీ పత్తికి అనుమతి లేదు

నిషేధిత హెర్బిసైడ్ టాలరెంట్ పత్తి(హెచ్‌టీ)వాడకూడదు. వీటి విక్రయాలకు భారత్‌లో అనుమతి లేదు. వీటిని ఎక్కడైనా విక్రయిస్తున్నట్లు భావిస్తే టోల్ ఫ్రీ నంబర్ 72888 94276 లేదా 72888 94213 కు సమాచారమివ్వాలి. వివరాలను అధికారులు గోప్యంగా ఉంచటంతో పాటు తగిన పారితోషికం అందజేస్తారు.

# తవ్విపోదురు గాక వాళ్లకేంటి?



ఖమ్మం : అభివృద్ధి పేరిట పర్యావరణానికి తీవ్ర విఘాతం కలుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదనే వాదనలు వ్యక్తమవుతున్నాయి. వందలాది సంవత్సరాల చరిత్ర కలిగిన వెన్నవల్లి గుట్టను ఖమ్మం- దేవరపల్లి గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారి నిర్మాణం కోసం తొలుస్తున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండు, మూడేళ్లలో గుట్ట కనుమరుగయ్యే దుస్థితి దాపురించిందని చెబుతున్నారు. 300 ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లుతున్నా అధికారులు స్పందించటం లేదని వాపోతున్నారు.

ఇదీ సంగతి..

కల్లూరు మండలం వెన్నవల్లిలో సర్వే నంబర్ 32, 29, 35, 36లో 180 ఎకరాల్లో గుట్ట విస్తరించి ఉంది. పట్టా భూములకు సంబంధించిన గుట్ట కావడంతో ప్రైవేటు యాజమానుల నుంచి గ్రీన్‌ఫీల్డ్ రహదారి గుత్తేదారు లీజుకు తీసుకున్నారు. గుట్టను తవ్వి మట్టిని రహదారి నిర్మాణానికి వినియోగిస్తున్నారు. పెద్దకోరుకొండి, చెన్నూరు, లింగాల మీదుగా వందలాది లారీలు తిరగటం వల్ల విపరీతంగా లేచే దుమ్ముతోనే కాలం వెళ్లదీస్తున్నామని ఆయా గ్రామాల ప్రజలు చెబుతున్నారు. రోడ్లపై నీళ్లు చల్లాలనే నిబంధనను గుత్తేదారు విస్మరిస్తున్నా అధికారులు పట్టించుకోవటం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రూ.కోటి నష్టం..

వెన్నవల్లి గుట్టను తవ్వే క్రమంలో ఎగిసిపడే దుమ్ము వల్ల సుమారు 300 ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లుతోంది. రహదారి నిర్మాణం చేపట్టిన గుత్తేదారు, రాయల్టీ రూపంలో రూ.లక్షలు సముపార్జిస్తున్న భూగర్భగనుల శాఖ, ఇతర అధికారులు పట్టించుకోకపోవడంతో రబీ సీజన్‌లో రూ.కోటి మేర నష్టపోయామని అన్నదాతలు వాపోతున్నారు.

పర్యావరణానికి విఘాతం

మధిర ఎన్నెస్పీ కాల్వ పక్కనే వెన్నవల్లి గుట్ట ఉంది. వివిధ గ్రామాలకు చెందిన పశువులు, మేకలు, గొర్రెలు మేత కోసం గుట్టకు వెళ్తాయి. గుట్టపై కురిసిన వర్షం నీరు పోచవరం పెద్దచెరువు, పెద్దకోరుకోండి బండికుంట, వెన్నవల్లి ఊరచెరువు, రావికంపాడు చెరువులకు చేరుతుంది. గుట్ట కనుమరుగైతే రాబోయే రోజుల్లో గొలుసుకట్టు చెరువుల్లో నీరు కనిపించదని స్థానికులు చెబుతున్నారు. కాల్వగట్టు బలహీనపడి తెగిపోయే ప్రమాదముందని రైతులు ఆందోళన చెందుతున్నారు. గుట్టపై వన్యమృగాల (అడవిపందులు, కొండముచ్చులు, నక్కలు, కుందేళ్లు ఇలా) ఉనికి ప్రశ్నార్థకంగా మారింది.

రెండున్నర ఎకరాల్లో మామిడితోట సాగు చేస్తున్నాను. ప్రకృతి అనుకూలిస్తే ఏటా రూ.లక్ష వరకు ఆదాయం వచ్చేది. గుట్ట తవ్వకంతో ఈ ఏడాది పూత దశలోనే దుమ్ము చేరటంతో పంట దెబ్బతింది. గుత్తేదారు నుంచి పరిహారం చెల్లించేలా అధికారులు జోక్యం చేసుకోవాలి.

కామిశెట్టి రాజారావు, వెన్నవల్లి

రెండెకరాల్లో మామిడి మొక్కలను ఆరేళ్ల క్రితం నాటాను. అంతర పంటగా మిర్చి సాగు చేస్తున్నాను. గుట్ట తవ్వకంతో ఎర్రదుబ్బ పడి మామిడి, మిరప పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి.

మార్త వీరయ్య, వెన్నవల్లి

వెన్నవల్లి గుట్ట తవ్వటంతో చిన్న, సన్నకారు రైతులకు చెందిన 300 ఎకరాల్లో పంట నష్టం జరిగింది. గుట్ట తవ్వే సమయంలో దుమ్ము వల్ల మా మూడెకరాల మామిడి తోట పూత దశలోనే దెబ్బతింది. అధికారులకు విన్నవించినా ఫలితం లేదు.

మార్తా రాములు, వెన్నవల్లి

రైతులు తమ ఇబ్బందులను తెలియజేస్తూ వినతిపత్రం అందజేశారు. వ్యవసాయశాఖ అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదిస్తాం. రైతుల సమస్యల పరిష్కారానికి ప్రయత్నిస్తాం.

సూర్యనారాయణ, ఆర్డీఓ, కల్లూరు

# పల్లెలకు ఊరట

ఖమ్మం : తెలంగాణ వ్యాప్తంగా గ్రామ పంచాయతీలకు బిల్లుల బకాయిలు విడుదల చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు వెలువరించింది. పల్లెల అభివృద్ధికి సొంతంగా డబ్బులు ఖర్చు చేసిన సర్పంచులు, కొన్నిచోట్ల అప్పులు తెచ్చి పాలన సాగించిన ప్రజాప్రతినిధులకు ప్రభుత్వ తాజా నిర్ణయం ఉపశమనం కలిగి ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లోని పంచాయతీల ఖాతాల్లో సుమారు రూ. 82.25 కోట్లు జమకానున్నాయి. ఖమ్మం జిల్లాలో 589, భద్రాద్రి జిల్లాలో 279 పంచాయతీలున్నాయి. గ్రామాల అభివృద్ధికి కేంద్రం నుంచి అందే 15వ ఆర్థిక సంఘం నిధులు, రాష్ట్ర ప్రభుత్వం నుంచి వచ్చే ఎస్ఎఫ్‌సీ నిధులు కీలకం. సుమారు ఎనిమిది నెలలుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి సక్రమంగా నిధులు విడుదల కావటం లేదు. నిధులు ఆలస్యంగానైనా ఖాతాల్లో జమవుతాయన్న ఉద్దేశంతో పాలకవర్గాలు అభివృద్ధి పనులు చేపట్టాయి. కొన్నిచోట్ల మాత్రం పారిశుధ్యం, ఫాగింగ్, చెత్త సేకరణ, హరితహారం మొక్కల సంరక్షణ, ట్రాక్టర్ల మరమ్మతులు, ట్రాలీల వినియోగం, సీసీరోడ్ల నిర్మాణం తదితరాలపై ప్రభావం పడింది. ఇవి కాకుండా పల్లెల ముఖచిత్రం మార్చేందుకు ప్రభుత్వం వైకుంఠధామాలు, డంపింగ్‌యార్డులు, పల్లె ప్రకృతి వనాలు, రైతు వేదికలను నిర్మించింది. వీటి నిర్మాణ బాధ్యతలను చాలాచోట్ల సర్పంచులకే అప్పగించింది. చాలామంది ప్రజాప్రతినిధులు సొంతంగా డబ్బులు వెచ్చించి నిర్మాణాలు చేపట్టారు. ఒక్కో సర్పంచి రూ.లక్షలు ఖర్చు చేశారు. చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించి బిల్లుల కోసం



నెలల తరబడి ఎదురుచూస్తున్నారు.

ఉభయ జిల్లాల్లో.. 4వేల జనాభా దాటిన ఒక్కో పంచాయతీకి సుమారు రూ. 7లక్షల వరకు, 2వేల జనాభా దాటిన పల్లెలకు రూ. 5 లక్షలు, మిగిలిన పంచాయతీలకు రూ. 3 లక్షల వరకు బకాయిలు పేరుకుపోయాయి. కొన్నినెలలుగా ఫ్రీజింగ్‌లో ఉన్న నిధులను విడుదల చేయాలని సర్కారు నిర్ణయించింది. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల పరిధిలో చేపట్టిన పనులకు సంబంధించిన బకాయిలను విడుదల చేసేలా ఉత్తర్వులు వెలువరించింది. భద్రాద్రి జిల్లాలో పంచాయతీరాజ్ శాఖ నుంచి సుమారు రూ. 7 కోట్లు, గ్రామీణాభివృద్ధి శాఖ నుంచి రూ. 33.25 కోట్లు, ఖమ్మం జిల్లాలో గ్రామీణాభివృద్ధి శాఖ నుంచి రూ. 31 కోట్లు, పంచాయతీరాజ్ శాఖ నుంచి రూ. 11 కోట్లు ఆయా గ్రామాలకు అందనున్నాయి.

# మెరుగైన విద్య.. నైపుణ్యాల పెంపు

వరంగల్ : విద్యార్థులకు త్వరితగతిన ఉపాధి కల్పన దిశగా సాంకేతిక విద్య అందించేందుకు ప్రభుత్వం పారిశ్రామిక శిక్షణ సంస్థలు(ఐటీఐ) నిర్వహిస్తోంది. దీంతో యువతకు స్వయం ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కూడా అపారంగా ఉంటాయి.. ఇదే సమయంలో పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా మానవ వనరుల కొరత కూడా దూరమవుతుంది.. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఐటీఐ విద్యార్థులకు నాణ్యమైన విద్య కోసం ప్రత్యేక యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ మేరకు పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐలలో ప్రవేశాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తుకు జూన్ 10వ తేదీ వరకు గడువు ఉంది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ప్రభుత్వ ఐటీఐలు ఆరు, మరో 20 వరకు ప్రైవేటు ఐటీఐలున్నాయి. ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ ఐటీఐలు భూపాలపల్లి, వరంగల్, హనుమకొండ, మహబూబాబాద్, ఏటూరునాగరం, కాజీపేట ప్రాంతాల్లో ఒక్కోటి చొప్పున ఉన్నాయి. ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, వెల్డర్, సివిల్, కంప్యూటర్ అండ్ ప్రోగ్రామింగ్ అసిస్టెంట్, షార్ట్ హ్యాండ్ తదితర కోర్సులు అందుబాటులో ఉన్నాయి. విద్యార్థులకు పదో తరగతిలో గ్రేడింగ్ ఆధారంగా సీట్ల కేటాయింపు ఉంటుంది.

ఆన్‌లైన్ తరగతులు

భారత్ స్కిల్స్ యాప్‌లో ఐటీఐలోని అన్ని ట్రేడ్‌లకు సంబంధించిన పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. ఇందుకోసం ఐచ్ఛికాలు ఎంచుకోవాల్సి ఉంటుంది. పుస్తకాలు కొనుగోలు చేయడం ఆర్థిక భారం అనుకునే వారికి ఇది మంచి అవకాశం.. యూట్యూబ్ లింక్



ద్వారా ఆన్‌లైన్ తరగతులు సైతం విద్యార్థులు తమకు ఖాళీ ఉన్న సమయంలో వినేందుకు వీలుంటుంది. పరీక్షల సన్నద్ధత, క్వశ్చన్ బ్యాంకులు కూడా యాప్‌లో అందుబాటులో ఉన్నాయి. అదేవిధంగా ఐటీఐ కోర్సు పూర్తి కాగానే విద్యార్థులు అప్రెంటిస్‌షిపప్ చేయాల్సి ఉంటుంది. ఇది పూర్తి చేసిన వారికే వివిధ పరిశ్రమల్లో ఉద్యోగావకాశాలు లభిస్తాయి. యాప్‌లో అప్రెంటిస్‌షిప్‌కు సంబంధించిన సమాచారం అందుబాటులో ఉంటుంది. కోర్సును అందించే పరిశ్రమల్లో ఖాళీలు, అర్హతలు తదితర సమాచారం దీని ద్వారా తెలుసుకోవచ్చు.

ఎంతో ఉపయుక్తం..

ఐటీఐ విద్యార్థులకు ఎంతో ఉపయుక్తంగా ఉండేలా ఇటీవల కేంద్ర ప్రభుత్వం 'భారత్ స్కిల్స్ యాప్'ను అందుబాటులోకి తీసుకొచ్చింది. స్మార్ట్ ఫోన్ కలిగి ఉన్న విద్యార్థులు ఈ యాప్‌ను ప్లే స్టోర్ నుంచి సులువుగా డౌన్‌లోడ్ చేసుకునే వీలుంది. మెయిల్ ఐడీ, చరవాణి సంఖ్య, యూజర్ ఐడీని పాస్‌వర్డ్‌గా ఉపయోగిస్తే సరిపోతుంది.

సద్వినియోగం చేసుకోవాలి

సూరం జగన్మోహన్‌రెడ్డి, ప్రభుత్వ ఐటీఐ, భూపాలపల్లి

భారత్ స్కిల్స్ యాప్‌ను ఐటీఐ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి. పరీక్షల సమాచారం కూడా తెలుసుకునే వీలుంటుంది. నాణ్యమైన విద్యను అందుబాటులోకి తీసుకురావడం, విద్యార్థుల్లో నైపుణ్యాల పెంపునకు బాటలు వేయాలన్నదే లక్ష్యం

# ఆరోగ్య మహిళ సేవలు విస్తృతం చేయాలి

పెద్దపల్లి : మహిళలు ఎదుర్కొంటున్న అనారోగ్య సమస్యలు గుర్తించి సరైన సేవలు అందించాలని పాలనాధికారిణి డా.సర్వే సంగీత ఆదేశించారు. ఆమె పెద్దపల్లి పట్టణ సమీపంలోని చీకురాయిలోని ఆరోగ్య మహిళా కేంద్రం, పెద్దబొంకూరులోని కంటి వైద్య శిబిరాన్ని సందర్శించారు. మహిళలకు అందుతున్న వైద్య సేవలపై తెలుసుకున్నారు. ఎనిమిది రకాల వైద్య పరీక్షలను అడిగి తెలుసుకున్నారు. ప్రమాదకర వ్యాధులపై అప్రమత్తం చేయాలని సూచించారు. మహిళా ఆరోగ్య కేంద్రం ఇన్‌ఛార్జి వైద్యాధికారి స్వప్న, సిబ్బంది పాల్గొన్నారు.

పోటీ పరీక్షలకు ఎంతో ఉపయుక్తం

రాష్ట్ర ముఖ్య ప్రణాళిక శాఖ ముద్రించిన తెలంగాణ సామాజిక ఆర్థిక ముఖ చిత్రం-2023 పుస్తకాన్ని పాలనాధికారిణి సంగీత ఆవిష్కరించారు. ప్రభుత్వ ఉద్యోగ సాధనలో పోటీ పరీక్షలకు ఈ పుస్తకం ఎంతో దోహదపడుతుందని చెప్పారు. పుస్తకం కావాల్సిన వారు జిల్లా ముఖ్య ప్రణాళిక కార్యాయంలో సంప్రదించాలని



సూచించారు. జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి రవీందర్ పాల్గొన్నారు.

ఉపకేంద్రాల నిర్మాణాలు పూర్తి చేయండి

జిల్లాలో ప్రాథమిక ఉప వైద్య కేంద్రాల భవనాల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని పాలనాధికారిణి సంగీత ఆదేశించారు. మంగళవారం రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు నిర్వహించిన దూరదృశ్య మాధ్యమ సదస్సుకు ఆమె హాజరయ్యారు. అనంతరం జిల్లా అధికారులతో సమీక్షించారు. జడ్పీ నిధులు అందుబాటులో ఉన్నాయని, టెండర్లు పిలిచి పనులు ప్రారంభించాలని సూచించారు. కేసీఆర్ న్యూట్రిషన్ కిట్ల పంపిణీలో జాగ్రత్తలు పాటించాలన్నారు. డీఎంహెచ్‌వో ప్రమోద్‌కుమార్, డీసీహెచ్ శ్రీధర్ పాల్గొన్నారు.

# సామాజిక బస్సు యాత్ర నిర్వహించే అర్హత వైకాపాకు లేదు: పురందేశ్వరి



ఒంగోలు: ఏపీలో వైకాపా విధ్వంసక పాలనను ప్రజలంతా గమనిస్తున్నారని భాజపా ఏపీ అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. ఒంగోలులో నిర్వహించిన భాజపా రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ప్రశ్నిస్తే కేసులు పెట్టించి ఇబ్బంది పెడుతున్నారన్నారని ఆరోపించారు. ఎస్సీలకు సంబంధించిన 27 పథకాలను రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేసిందని పురందేశ్వరి అన్నారు. బీసీ, ఎస్సీలపై దాడులు చేస్తూ చిత్రహింసలకు గురిచేస్తున్నారని ఆమె మండిపడ్డారు. నిధులు, విధులు లేని 56 కార్పొరేషన్లను వైకాపా ప్రభుత్వం ఏర్పాటు చేసిందని విమర్శించారు. సామాజిక బస్సు యాత్ర నిర్వహించే అర్హత వైకాపాకు లేదని పురందేశ్వరి అన్నారు. ఈ సమావేశంలో జాతీయ నేత బీఎల్ సంతోష్‌తో పాటు సోము వీర్రాజు, సత్యకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## మూడేళ్లుగా ఏం చేస్తున్నారు..? తమిళనాడు గవర్నర్‌కు సుప్రీం ప్రశ్న



దిల్లీ: రాష్ట్ర అసెంబ్లీ తీర్మానించిన బిల్లులకు ఆమోదం తెలపకుండా మూడేళ్లుగా ఏం చేస్తున్నారని.. తమిళనాడు గవర్నర్ ఆర్ఎన్ రవిని సుప్రీంకోర్టు ధర్మాసనం ప్రశ్నించింది. శాసనసభ ఆమోదం తెలిపిన బిల్లులను ఉద్దేశపూర్వకంగానే గవర్నర్‌లు ఆమోదించకుండా జాప్యం చేస్తున్నారని తమిళనాడు, కేరళ, పంజాబ్ ప్రభుత్వాలు పిటిషన్లు దాఖలు చేశాయి. వీటిపై సుప్రీం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టింది. బిల్లులకు ఆమోదం తెలపకుండా తమిళనాడు గవర్నర్ మూడేళ్లుగా ఏం చేస్తున్నారని ప్రశ్నించింది. మరోవైపు కేరళ గవర్నర్ ఆరిఫ్ మహ్మద్ ఖాన్, ఆయన కార్యాలయంతోపాటు కేంద్ర ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. బిల్లుల ఆమోదానికి జరుగుతున్న జాప్యానికి కారణాలు వివరించాలని నోటీసుల్లో ఆదేశించింది. కేరళ ప్రభుత్వం తరపున సీనియర్ న్యాయవాది కేకే వేణుగోపాల్ వాదనలు వినిపించారు. ఈ సందర్భంగా ఆయన.. రాజ్యాంగంలోని ఆర్టికల్ 168 ప్రకారం గవర్నర్‌లు శాసనసభలో భాగమనే విషయాన్ని గుర్తుంచుకోవాలని కోర్టుకు విన్నవించారు. అందుకు సంబంధించిన వివరాలను సుప్రీం ధర్మాసనానికి సమర్పించారు. గత 21 నెలలుగా ఎనిమిది బిల్లులను గవర్నర్ ఆమోదించలేదని తెలిపారు.

## లోకేష్ యువగళం పున: ప్రారంభం.. ఎప్పటి నుంచి అంటే..



అమరావతి : ఈ నెల 24వ తేదీ నుంచి టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యువగళం పున: ప్రారంభం కానుంది. విశాఖలో పాదయాత్రను ముగించే యోచనలో టీడీపీ అధిష్టానం ఉన్నట్టు తెలుస్తోంది. టీడీపీ అధినేత చంద్రబాబు అరెస్టుతో సెప్టెంబర్ 9వ తేదీన యువగళం పాదయాత్ర నిలిచిపోయింది. పాదయాత్ర నిలిచిపోయిన చోట నుంచి తిరిగి ప్రారంభించాలని నిర్ణయించారు.

చంద్రబాబు గతంలో వస్తున్న మీకోసం పాదయాత్రను విశాఖలో ముగించారు. అదే సెంటిమెంటుతో లోకేష్ కూడా విశాఖలోనే పాదయాత్ర ముగించాలని నిర్ణయం తీసుకున్నారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో పాదయాత్రను కుదించే యోచనలో పార్టీ వర్గాలు ఉన్నట్టు సమాచారం.




గాజాలోని అతిపెద్ద ఆస్పత్రి అల్-షిఫాను.. హమాస్ తమ ప్రధాన కమాండ్ సెంటర్‌గా వాడుకుంటోందని చెబుతున్న ఇజ్రాయెల్ అందుకు బలమైన సాక్ష్యాలను బయటపెడుతోంది. తాజాగా ఈ ఆస్పత్రిలో బందీలను దాచిపెట్టిన ఓ వీడియోను ఐడీఎఫ్ ఎక్స్ వేదికగా విడుదల చేసింది. అక్టోబరు 7న ఇజ్రాయెల్‌పై దాడి తర్వాత ఆ దేశం నుంచి కిడ్నాప్ చేసిన కొంతమందిని అల్-షిఫాలో బంధించేందుకు తీసుకురావడం ఆ వీడియోలో స్పష్టంగా కన్పించింది. అక్టోబరు 7న ఉదయం 10.42 నుంచి 11 గంటల మధ్య అల్-షిఫా ఆస్పత్రి సీసీటీవీ కెమెరాల్లో రికార్డ్ అయిన దృశ్యాలను ఐడీఎఫ్ విడుదల చేసింది. అందులో చేతిలో ఆయుధాలతో ఉన్న హమాస్ ఉగ్రవాదులు.. ఓ వ్యక్తిని బలవంతంగా ఆస్పత్రి లోపలికి లాక్కొస్తున్నట్లుగా ఉంది. తీవ్రంగా గాయపడిన మరో బందీని ఆపరేషన్ థియేటర్‌లోకి తీసుకెళుతున్నట్లుగా వీడియోలో రికార్డ్ అయ్యింది. దీనిపై ఐడీఎఫ్ మిలిటరీ అధికార ప్రతినిధి డేనియల్ హగారీ స్పందిస్తూ.. ఆ బందీలు నేపాల్, థాయ్‌లాండ్ దేశస్థులని తెలిపారు. "ఇప్పుడు ఆ ఇద్దరి పరిస్థితి ఎలా ఉంది? వారు ఎక్కడ ఉన్నారు? అనేది ఇంకా తెలియలేదు. ఇజ్రాయెల్‌పై నరమేధం జరిపిన రోజున అల్-షిఫా ఆస్పత్రిని వారు వినియోగించుకున్నారని మాత్రం స్పష్టమైంది" అని ఇజ్రాయెల్ సైన్యం ఓ ప్రకటనలో వెల్లడించింది.

**ఆస్పత్రి కింద సొరంగం..** ఇక, గత వారమే ఈ ఆస్పత్రిలోకి అడుగుపెట్టిన ఇజ్రాయెల్ దళాలు అక్కడ ముమ్మరంగా తనిఖీలు చేపడుతున్నాయి. ఈ క్రమంలోనే ఆస్పత్రి కింద ఓ సొరంగాన్ని తాజాగా గుర్తించాయి. ఈ వీడియోను కూడా ఐడీఎఫ్ విడుదల చేసింది. ఆస్పత్రి కింద 10 మీటర్ల లోతులో 55 మీటర్ల పొడవులో ఈ టన్నెల్ ఉన్నట్లు తెలిపింది.

అయితే, ఆ సొరంగంలో ఏమున్నదనే విషయాన్ని మాత్రం ఐడీఎఫ్ వెల్లడించలేదు. మరోవైపు, హమాస్ మిలిటెంట్లపై జరుగుతున్న గ్రౌండ్ ఆపరేషన్‌లో మరో ఐదుగురు ఇజ్రాయెల్ సైనికులు మరణించారు. దీంతో భూతల పోరులో ఇప్పటివరకు ఇజ్రాయెల్ వైపు 64 మంది సైనికులు మృతిచెందినట్లు ఐడీఎఫ్ వెల్లడించింది.

## శివాలయాలకు పోటెత్తిన భక్తులు




విజయవాడ: కార్తీక మాసం మొదటి సోమవారం సందర్భంగా శివాలయాలకు భక్తులు పోటెత్తారు. కార్తీక దామోదరుడుకి విశేష పూజలు చేస్తున్నారు. ఓం నమశ్శివాయ అనే పంచాక్షరి మంత్రంతో శివాలయాలు మారుమోగుతున్నాయి. కార్తీక దామోదరుడికి బిల్వార్చనలు, రుద్రాభిషేకాలు, మహా రుద్రాభిషేకాలు, పంచామృతాలతో అర్చకులు అభిషేకాలు చేస్తున్నారు. పంచారామ, శైవ క్షేత్రాలను భక్తులు సందర్శిస్తున్నారు. నది, సముద్ర స్నానాలను ఆచరించి కార్తీకదీపం వదులుతున్నారు.

కార్తీక సోమవారం సందర్భంగా ఆలయాల్లో 365 వొత్తులను వెలిగించుకొని మహిళలు ఉపవాసాలను ఆచరిస్తున్నారు. భక్తులు హర హర మహాదేవ శంభో శంకర అంటూ శివనామస్మరణ చేస్తున్నారు. పశ్చిమగోదావరి జిల్లా, భీమవరం పంచారామ క్షేత్రం శ్రీ ఉమా సోమేశ్వర జనార్ధన స్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. అర్చకులు స్వామివారికి పంచామృతాభిషేకం నిర్వహించారు. భక్తులు సోమవారం తెల్లవారుజాము 3 గంటల నుంచి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక అభిషేకాలు నిర్వహిస్తున్నారు.

అలాగే పాలకొల్లులోని క్షీరా రామలింగేశ్వర స్వామి ఆలయంలో కార్తీక శోభ సంతరించుకుంది. కార్తీక మాసం మొదటి సోమవారం సందర్భంగా వేలాది మంది భక్తులతో ఆలయం కిటకిటలాడుతోంది. దీపాలు వెలిగించి పూజలు చేస్తున్నారు.




విశాఖపట్నం: విశాఖలోని ఫిషింగ్ హార్బర్‌లో ఆదివారం రాత్రి అగ్నిప్రమాదం జరిగింది. ఓ బోటులో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. సమాచారమందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలికి చేరుకొని మంటలను అదుపుచేశారు.

ఈ అగ్నిప్రమాదంలో 40కి పైగా బోట్లు కాలిపోయాయని స్థానికులు చెబుతున్నారు. వీటి విలువ రూ.40-50లక్షలు ఉంటుందని పేర్కొంటున్నారు. గుర్తు తెలియని వ్యక్తులు కావాలనే ఇలా చేసి ఉంటారని బాధితులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. బోట్లలో నిద్రిస్తున్న వారు మంటల్లో చిక్కుకుని ఉన్నారేమో అని కార్మికులు తొలుత అనుమానించారు. ఎటువంటి ప్రాణనష్టం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. భారీ ఎత్తున ఆస్తి నష్టం జరగడంతో బాధిత కుటుంబసభ్యులు బోరున విలపించారు.

## ఘటనాస్థలికి జగన్ రావాల్సిందే: 'ఫిషింగ్ హార్బర్' బాధితుల ఆందోళన



విశాఖపట్నం: నగరంలోని ఫిషింగ్ హార్బర్‌లో చెలరేగిన మంటలకు 40కి పైగా బోట్లు దహనమైన విషయం తెలిసిందే. బాధితులకు న్యాయం చేయాలంటూ మత్స్యకార నాయకులు నిరసన చేపట్టారు. ఫిషింగ్ హార్బర్ వద్ద బైఠాయించి ఆందోళన చేపట్టారు. బాధితులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని.. వెంటనే నష్టపరిహారం ప్రకటించాలని డిమాండ్ చేశారు. సీఎం జగన్ సాయంత్రంలోపు ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించి తమకు న్యాయం చేయాలన్నారు. బోటుకు రూ.50లక్షల పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. తమకు న్యాయం జరిగే వరకు పోరాడతామని తేల్చిచెప్పారు.

## విశాఖ ప్రమాదంపై సీఎం జగన్ దిగ్భ్రాంతి



విశాఖపట్నం: విశాఖపట్నంలో ఫిషింగ్ హార్బర్‌లో బోట్లు దగ్ధమైన ఘటనపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ఘటనలో బాధితులను ఆదుకోవాలని అధికారులను సీఎం ఆదేశించారు. ప్రమాదంపై లోతైన దర్యాప్తు జరిపి కారణాలు వెలికి తీయాలని ఆదేశించారు. మంత్రి సీదిరి అప్పలరాజును ఘటనా స్థలానికి వెళ్లాలని సూచించారు. బోట్లు కోల్పోయిన మత్స్యకారులకు అండగా ఉండాలని, తగిన విధంగా వారికి సహాయం చేయాలని వై ఎస్ జగన్ అధికారులను ఆదేశించారు. కాగా విశాఖ ఫిషింగ్ హర్బర్‌లో భారీ అగ్ని ప్రమాద ఘటన చోటుచేసుకుంది. ఆదివారం అర్ధరాత్రి ఓ బోటులో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఈ అగ్నిప్రమాదంలో 40కి పైగా బోట్లు కాలిపోయినట్లు స్థానికులు చెబుతున్నారు. భారీగా ఆస్తి నష్టం వాటిల్లినట్లు పేర్కొన్నారు. దీంతో మత్స్యకారుల కుటుంబాలలో విషాదం నెలకొంది. అగ్ని ప్రమాదం ఘటనలో ఓ యూట్యూబర్‌పై కేసు నమోదు చేయాలని పోలసులు భావిస్తున్నారు. ఆదివారం రాత్రి ఫిషింగ్ హార్బర్‌లో యూట్యూబర్ పార్టీ ఇచ్చినట్లు, మద్యం మత్తులో గొడవ జరిగినట్టు పోలీసులు గుర్తించారు. ప్రస్తుతం యూట్యూబర్ పరారీలోఉన్నట్లు పోలీసులు తెలిపారు.

## విశాఖ ఫిషింగ్ హార్బర్‌లో అగ్నిప్రమాదంపై పవన్ రియాక్షన్



అమరావతి: విశాఖపట్నంలోని ఫిషింగ్ హార్బర్‌లో అగ్నిప్రమాదంపై జనసేన అధినేత పవన్ కళ్యాణ్ స్పందించారు. ఫిషింగ్ హార్బర్‌లో అర్ధరాత్రి చోటు చేసుకున్న అగ్ని ప్రమాదంలో 40 బోట్లు దగ్ధం కావడం దురదృష్టకరమన్నారు. ఈ ప్రమాదం వల్ల నష్టపోయిన బోట్ల యజమానులను అన్ని విధాలుగా ఆదుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. వీటిపై ఆధారపడ్డ మత్స్యకారులకు జీవన భృతి అందించాల్సిన అవసరం ఉందన్నారు.

విశాఖ ఫిషింగ్ హార్బర్‌లో చోటు చేసుకున్న అగ్ని ప్రమాదంపై విచారణ చేపట్టాలని.. భద్రతాపరమైన అంశాలపై సమీక్షించి, పటిష్ట చర్యలు తీసుకోవాలని పవన్ కళ్యాణ్ డిమాండ్ చేశారు.

## ఫిషింగ్ హార్బర్ అగ్ని ప్రమాదం.. బాధ కలిగించింది: నారా లోకేశ



అమరావతి: విశాఖ ఫిషింగ్ హార్బర్‌లో మత్స్యకారులకు చెందిన 40కిపైగా బోట్లు అగ్నికి ఆహుతి కావడం బాధ కలిగించిందని తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ అన్నారు. అత్యంత సున్నితమైన ప్రాంతంలో భద్రతా చర్యల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం దారుణమని మండిపడ్డారు. "ఈ ప్రమాదంలో నష్టపోయిన వారంతా రెక్కాడితే కానీ డొక్కాడని పేద మత్స్యకారులు. ప్రభుత్వం పెద్దమనసు చేసుకుని కొత్తబోట్లు, మెరుగైన నష్టపరిహారం అందించి ఆదుకోవాలి. అగ్నిప్రమాదంపై పూర్తి స్థాయి విచారణ జరపాలి" అని లోకేశ్ డిమాండ్ చేశారు.

**రుషికొండపైనే కాదు.. ప్రజల భద్రతపైనా జగన్ దృష్టిపెట్టాలి :** భద్రతా చర్యలు లేకపోవడంతోనే ఫిషింగ్ హార్బర్‌లో ప్రమాదం జరిగిందని తెదేపా ఏపీ అధ్యక్షుడు అచ్చెన్నాయుడు ఆరోపించారు. నిర్లక్ష్యంతో మత్స్యకారుల ప్రాణాలకు ముప్పుతేవొద్దని ప్రభుత్వానికి హితవు పలికారు. "వరుస ప్రమాదాలు జరుగుతున్నా ప్రభుత్వానికి పట్టదు. ప్రభుత్వ నిర్లక్ష్యంతో మత్స్యకారుల ప్రాణాలకు ముప్పు ఏర్పడే ప్రమాదముంది. విశాఖలోని పరిశ్రమల్లో ఎన్నో ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. రుషికొండ నిర్మాణంపైనే కాదు.. ప్రజల భద్రతపైనా జగన్ దృష్టిపెట్టాలి. బోట్లు కోల్పోయిన వారికి ప్రభుత్వమే కొత్త బోట్లు అందజేయాలి. మరోమారు అగ్నిప్రమాదాలకు తావులేకుండా ప్రభుత్వం ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి" అని అచ్చెన్న సూచించారు.

## భద్రతా చర్యలు లేకనే ఫిషింగ్ హార్బర్‌లో ప్రమాదం



అమరావతి: విశాఖ ఫిషింగ్ హార్బర్‌లో భారీ అగ్ని ప్రమాదంపై ఏపీ టీడీపీ చీఫ్ అచ్చెన్నాయుడు స్పందించారు. భద్రతా చర్యలు లేకనే ఫిషింగ్ హార్బర్‌లో ప్రమాదం అని అన్నారు. నిర్లక్ష్యంతో మత్స్యకారుల ప్రాణాలకు ముప్పుతేవద్దని హితవుపలికారు. విశాఖ ఫిషింగ్ హార్బర్‌లో అగ్నిప్రమాదానికి భద్రతా చర్యలు లేకపోవడమే కారణమన్నారు. వరుస ప్రమాదాలు జరుగున్నప్పటికీ ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని మండిపడ్డారు.

ప్రభుత్వ నిర్లక్ష్యంతో కార్మికులు, మత్స్యకారుల ప్రాణాలకు ముప్పు ఏర్పడే ప్రమాదముందన్నారు. విశాఖలోని పలు పరిశ్రమల్లో ఇది వరకే ఎన్నో ప్రమాదాలు చోటు చేసుకున్నాయని.. వాటిని చూసైనా ప్రభుత్వం కళ్లు తెరవడం లేదని విమర్శించారు.

సీఎం జగన్ రిషికొండ ప్యాలెస్ నిర్మాణంపైనున్న శ్రద్ధ ప్రజల భద్రతపై పెట్టాలని వ్యాఖ్యలు చేశారు. అగ్ని ప్రమాదంలో 40కి పైగా బోట్లు దగ్ధమైనట్లు తెలుస్తోందని.. బోట్లు కోల్పోయిన వారికి ప్రభుత్వమే కొత్త బోట్లు అందజేయాలని డిమాండ్ చేశారు. మరోమారు అగ్నిప్రమాదాలకు తావులేకుండా ప్రభుత్వం ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అచ్చెన్నాయుడు పేర్కొన్నారు.

## నేడు సీఎం వైయస్ జగన్ సూళ్ళూరుపేట పర్యటన



తాడేపల్లి: ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి రేపు (21.11.2023) తిరుపతి జిల్లా సూళ్ళూరుపేటలో పర్యటించనున్నారు. పలు అభివృద్ధి పనులకు శంకుస్ధాపన, ప్రారంభోత్సవాలు, బహిరంగ సభలో పాల్గొననున్న సీఎం. ఉదయం 8.30 గంటలకు తాడేపల్లి నివాసం నుంచి బయలుదేరి తడ మండలం మాంబట్టు ఎస్ఈజెడ్ వద్ద ఏర్పాటు చేసిన బహిరంగ సభా ప్రాంగణం వద్ద పలు అభివృద్ధి పనులకు శంకుస్ధాపన, ప్రారంభోత్సవాలు, బహిరంగ సభలో పాల్గొని ప్రసంగించనున్న సీఎం, సభ అనంతరం తాడేపల్లి నివాసానికి చేరుకుంటారు.

# ఆస్తులు అమ్మేస్తోన్న హీరోయిన్.. కారణం ఏంటబ్బా?

సెలబ్రిటీలు అంతరిక్షంలో సైతం ఆస్తులు కొనేస్తున్న సమయం ఇది. ఇప్పటికే భూమ్మీద ఆవాసం బోర్ కొట్టిన సెలబ్రిటీలు అంతరిక్షంలో కూడా ఇళ్లు నిర్మించుకుని అక్కడ జీవించాలని ఆశపడుతున్నారు. కొంత మంది సెలబ్రిటీలు స్పేస్ లో ప్లాట్ లు కొనుగోలు చేసారు. ప్రతీ ఏడాది పన్నులు కూడా చెల్లిస్తు న్నారు. చంద్రయాన్ సక్సెస్ అయిన నేపథ్యంలో ఇళ్లు కట్టుకోవడానికి ఇంకెంతో సమయం పట్టదని చాలా మంది భావిస్తున్నారు. ఇలాంటి సమయంలో గ్లోబల్ స్టార్ ప్రియాంక చోప్రా ఉన్న ఆస్తులే అమ్మేస్తుంది అన్న వార్త మరోసారి సంచలనం అవుతుంది. భారత్ లో ఉన్న ఒక్క ప్రోపర్టీని సేల్ పెట్టి డబ్బుని ఖాతాలో జమ చేసుకుంటు న్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే లోఖండ్ వాలో ఒక కమర్శియల్ ప్రాపర్టీని 7 కోట్లకు



అమ్మేసింది. తాజాగా అంధేరిలో ఉన్న అపార్ట్ మెంట్ ని కూడా అమ్మకానికి పెట్టినట్లు వార్తలొస్తున్నాయి. ఈ అపార్ట్ మెంట్ ని దర్శక-నిర్మాత అభిషేక్ చౌబే భారీ ధరకు కొనుగోలు చేసారుట. దాదాపు 6 కోట్లకు కొన్నట్లు తెలుస్తుంది. అక్టోబర్ 23..25 తేదీల్లో లావాదేవీలు జరిగినట్లు సమాచారం. ఈ మొత్తం వ్యవహారాన్ని భారత్ లో ఉన్న పీసీ తల్లి చూసారుట. స్టాంప్ డ్యూటీ ఛార్జీలుగా 36 లక్షలు చెల్లించినట్లు సమాచారం. అయితే పీసీ ఇలా వరుస పెట్టి ఒకదాని వెంట ఒకటి అమ్మడంతో అమ్మడు ఇండియా వదిలి పూర్తిగా అమెరికాలో స్థిర పడే ప్లాన్ లో ఉందా? అన్న సందేహాలు తెరపైకి వస్తున్నాయి. ఇప్పటికే అమెరికన్ పౌరసత్వం తీసుకుంది. లాస్ ఎంజెల్స్ లో భర్త నిక్ జోనాస్ తో కలిసి చాలా కాలంగా ఉంటుంది. అక్కడ ఉంటోన్న ప్లాట్ అద్దెకా? సొంతదా ? అన్నది తెలియదుగానీ పెళ్లైన తర్వాత ఎక్కువ సమయం తీసుకోకుండానే కాపురం పెట్టేసింది. కెరీర్ పరంగా హాలీవుడ్ సినిమాలతో బిజీగా ఉండటంతో ఇంతకాలం అక్కడలా ఉంది అనుకున్నారు. కానీ ఇండియాలో ఆస్తులు అమ్మేస్తోన్న వైనం చూస్తుంటే శాశ్వతంగా స్వదేశానికి దూరమయ్యే ప్లాన్ లో ఉందా? అన్న సందేహాలు తెరపైకి వస్తున్నాయి.

## జెబ్బల గౌనులో హృదయం జారేలా అనికా!

చైల్డ్ ఆర్టిస్ట్ గా తెరంగేట్రం చేసిన అనికా సురేంద్రన్ పరిచయం అవసరం లేని పేరు. ఇప్పుడా చైల్డ్ ఆర్టిస్ట్ నెట్టింట ఎంత ఫేమస్ అన్నది చెప్పాల్సిన పనిలేదు. 18 ప్రాయంలోకి అడుగు పెట్టిన అనికా హీరోయిన్లకు నేనేం తీసిపోను అని చాటి చెబుతుంది. ఎప్పటికప్పుడు న్యూలుక్ తో ఆకట్టుకుంటుంది. కొత్త ఫోటో షూట్లతో కుర్రాళ్లలో కాకలు పుట్టిస్తుంది. ఇంకా పూర్తి స్థాయిలో అందాల ఆరబోతకు రెడీ కాలేదు కానీ.. అమ్మడు మాత్రం అందుకు సంసిద్ధంగానే ఉంది. స్కిన్ షోకి..గ్లామర్ షోకి పర్ఫెక్ట్ టైమ్ రావాలని చూస్తుంది. తాజాగా బ్యూటీ నుంచి మరో న్యూపిక్ లీకైంది. ఇదిగో ఇక్కడిలో తెలుపు రంగు జెబ్బల గౌనులో గుభాళించింది. బ్యాక్



గ్రౌండ్..అనికా స్కిన్ టోన్ ఒకే రంగులో ఉన్నాయి. ఆ బ్యూటీపై తెలుగు గౌనులో మరింత ఆకర్షణీయంగా కనిపిస్తుంది. క్యూట్ స్మైల్ ముఖాన్ని మరింత ప్రకాశవంతంగా మలిచింది. హెయిర్ స్టైల్... మ్యాకప్ ..చెవిపోగులు అమ్మడిని మరింత అందంగా ఫోకస్ చేస్తున్నాయి. ప్రస్తుతం ఈ ఫోటో నెట్టింట వైరల్ గా మారింది. అనికా అందానికి కుర్రకారు ఫిదా అవుతున్నారు. మా హృదయం జారిందం టూ కామెంట్లు పెడుతున్నారు. ఇక అనికా కెరీర్ సంగతి చూస్తే చేతిలో చాలా సినిమాలున్నాయి. కానీ అవేవి హీరోయిన్ ఛాన్సులు కాదు. సినిమాల్లో కేవలం కీలక పాత్రలు మాత్రమే. మరి అమ్మడినిక హీరోయిన్ గా ఎందుకు కన్సిడర్ చేయడం లేదు? అన్నది ఆసక్తికరం. అనికాకి ఇంకా హీరోయిన్ అయ్యే వయసు రాలేదని పరిశ్రమ భావిస్తుంది. 18 ఏళ్లతో మేజర్ అయినా పరిశ్రమ ఇంకా ఆ బ్యూటీని చిన్న పిల్లగానే ట్రీట్ చేస్తున్నట్లు కనిపిస్తుంది. ఇటీవలే ధనుష్ 50వ చిత్రంలోనూ ఎంపికైంది. ఇందులోనూ అదే పరిస్థితి. మరి ఈ బ్యూటీని మెయిన్ లీడ్ లో పెట్టి ఏ దర్శకుడు సినిమా చేస్తాడు? అన్నది చూడాలి. మరోవైపు తానింకా చిన్న పిల్లని కాదని సామాజిక మాధ్యమాల వేదికగా చెప్పే ప్రయత్నం కొనసాగుతూనే ఉంది.





# లేడీ సూపర్ స్టార్ బర్త్ డే స్పెషల్



లేడీ సూపర్ స్టార్ నయనతార తన 39వ పుట్టిన రోజును జరుపుకుంది. ఎప్పటిలాగే సోషల్ మీడియాలో ఆమె అభిమానులు సందడి చేశారు. నయన్ ఫోటోలు వీడియో లు షేర్ చేసుకుంటూ సోషల్ మీడియా ద్వారా బర్త్ డే హ్యాష్ ట్యాగ్ ను ట్రెండ్ చేయడం జరిగింది. అయితే ఒక ఫోటో చాలా ప్రత్యేకంగా అందరి దృష్టిని ఆకర్షించింది. గతంలో సోషల్ మీడియాలో పెద్దగా యాక్టివ్ గా ఉ ఒడని నయన్ ఇప్పుడు తన పిల్లలతో పాటు, తన భర్త విఘ్నేష్ శివన్ తో కలిసి చాలా యాక్టివ్ గా సోషల్ మీడియాలో కనిపిస్తోంది. తాజాగా తన బర్త్ డే సందర్భంగా తీసుకున్న ఈ ఫోటోను సోషల్ మీడియా ద్వారా అభిమానులతో నయనతార దంపతులు పంచుకోవడంతో వైరల్ అయింది. ఈ ఫోటోలో నయన్, విఘ్నేష్ శివన్ దంపతుల పిల్లలు అయిన ఉయిర్ రుద్రోనిల్ ఎన్ శివన్ మరియు ఉలగ్ దైవాగ్ ఎన్ లతో సోషల్ మీడియా ద్వారా సందడి చేశారు. ఈ ఫోటో తో నయనతార ఫ్యాన్స్ కి కన్నుల విందు చేసే విధంగా చక్కటి బర్త్ డే గిఫ్ట్ ఇచ్చిందని నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. ఇక హిందీ లో జవాన్ సినిమా తో ఎంట్రీ ఇచ్చిన ఈ అమ్మడు జోరుగా సినిమాలు చేస్తోంది. ఒక వైపు హీరో లకు జోడీగా నటిస్తూనే మరో వైపు లేడీ ఓరియంటెడ్ కథ లు చేస్తూ ఉంది. మినిమం గ్యారెంటీ సినిమాలను ప్రేక్షకులకు అందిస్తున్న నయన్ సోషల్ మీడియాలో కూడా తగ్గేదే లే అన్నట్లుగా ఇలాంటి ఫోటోలతో సందడి చేస్తోంది.

# ఆ బ్యూటీ మనసు తట్టింది ఎవరబ్బా?




ఇన్ స్టా క్వీన్ దివి వదత్య టెంప్టింగ్ ఎలివేషన్ల గురించి చెప్పాల్సిన పనిలేదు. బ్యూటీ సోషల్ మీడియాలో పిక్ పెట్టిందంటే? అక్కడ చర్చ జరగాల్సిందే. అంద చందాలతో మత్తెక్కించే ఫోటలతో కాకలు పుట్టిస్తుం ది. నటిగా కన్నా..ఇన్ స్టాక్వీన్ గా బాగా పాపులర్ అయింది. ఇప్పుడిప్పుడే నటిగానూ బిజీ అవుతోంది. తాజాగా బ్యూటీ మరో ఫోటోతో అంతర్జాలంలోకి వచ్చేసింది.

ఇదిగో ఇక్కడిలా డిజైనర్ దుస్తుల్లో సెగలు పుట్టిస్తుంది. మల్టీ డిజైన్ బాటమ్ పై ఎరుపు వర్ణం బ్లౌజులో అందాల ఆరబోత షురూ చేసింది. సొగసరి మ్యాకప్ ..నెక్ పై ముత్యపు గోలుసు మరింత వన్నె మరింత ఆకర్షణీయంగా తీర్చి దిద్దాయి.

రూపంలో మార్పులు కొట్టొచ్చినట్లుంది. మునుపటి ఫోటోలతో పోల్చితే శరీరం సహారూప లావణ్యంలో భారీ మార్పులే కనిపిస్తున్నాయి. ఈ ఫోటని ఉద్దేశించి దివి ఓ పోస్ట్ కూడా చేసింది. తొలిసారి మిమ్మల్ని చూసింది మొదలు కదిలాయి మదిలోన ఎన్నెన్నో కథలు అంటూ తనలో రచయిత్రిని తట్టి లేపింది. అమ్మడి కామెంట్ ని బట్టి ప్రేమలో పడిందా? అన్న సందేహం రాకమానదు. ప్రస్తుతం ఈ ఫోటో నెట్టింట వైరల్ గా మారింది. బ్యూటీ కెరీర్ సంగతి చూస్తే సినిమా ఇండస్ట్రీలో అడుగు పెట్టి చాలా కాలం అయినా ఇన్నాళ్లు పెద్దగా గుర్తింపు రాలేదు. బిగ్ బాస్ తో అనూహ్యంగా అమ్మడు కి స్టార్ డమ్ వచ్చింది. బిగ్ బాస్ లో ఉన్నది కొన్నాళ్లే అయినా కూడా ఏకంగా హీరోయిన్ ఛాన్స్ లు వస్తున్నాయి. బిగ్ బాస్ ఫినాలే స్టేజ్ పై దివి అందం గురించి చిరంజీవి చేసిన వ్యాఖ్యలు ఆమె స్థాయిని పెంచాయి. ఆ ప్రశంసలు అవకాశాలకు దారి తీసాయి. నేరుగా చిరంజీవి సినిమాలోనే అప్పుడు అవకాశం కల్పించారు. తాజాగా దర్శక-నిర్మాతల నుంచి పిలుపులు బాగానే అందుకుంటుందని టాక్. అలాగే వెబ్ సిరీస్ ల్లోనూ నటించేందుకు సిద్దం అవుతోంది.

## పొలిమేర లచ్చిమి అపోలో డాక్టర్!

'మా ఊరి పోలిమేర' ఫ్రాంచైజీ పెద్ద సక్సెస్ అవ్వడంతో అందులో నటీనటులు ఒక్కొక్కరుగా వెలుగులోకి వస్తున్నారు. ఎలాంటి అంచానలు లేకుండా ఓటీటీలో రిలీజ్ అయిన పొలిమేర మొదటి భాగానికి మంచి రెస్పాన్స్ రావడంతో పొలిమేర-2ని ఏకంగా థియేటర్లో నే రిలీజ్ చేసి భారీ సక్సెస్ అందుకున్నారు. ఇందులో నటించింది పెద్దస్టార్లు కాదు. కమెడియన్లు..చిన్న చిన్న ఆర్టిస్టులే. కానీ సినిమా సక్సెస్ తో అందరికీ మంచి గుర్తుంపు దక్కుతుంది. సత్యం రాజేష్ రోల్ తో పాటు ఆయన భార్య పాత్ర పోషించిన కానాక్షి భాస్కర్ ఎక్కువగానే వైరల్ అవుతుంది. ఇందులో అమ్మడు లచ్చిమి పాత్రలో మెప్పించింది. ఆమె పల్లెటూరి ఆహార్యం ప్రేక్షకుల్ని ఆకట్టుకుంది. ఆమె ఆహార్యం...నటన చూసి మీనాక్షి నిజంగానే పల్లెటూరు నుంచి వచ్చిన అమ్మాయా? అన్న సందేహం కలుగుతుంది. అలా



కనిపించడమే నేడు ఆమెకి ప్రత్యేకమైన గుర్తింపును తీసుకొచ్చింది. మరి కానాక్షి నిజంగా పల్లెటూరు నుంచి వచ్చిందా? సిటీ నుంచి వచ్చిన అమ్మాయా? అన్నది తెలుసుకుందాం.

కామాక్షి భాస్కర్ల చైనాలో మెడిసిన్ చేసింది. అపోలో హాస్పిటల్లో డాక్టర్ గా కొంతకాలం పనిచేసిందిట. ఆ తరువాతనే మోడలింగ్ పట్ల ఆసక్తి అటువైపు టర్న్ తీసుకుంది. అక్కడా గుర్తింపు రావడంతో సినిమాల్లోనూ ప్రయత్నాలు చేసి సక్సస్ అయినట్లు ఓ ఇంటర్వ్యూలో రివీల్ చేసింది. 'నేను ఎవరితో ఎక్కువగా మాట్లాడను . పార్టీలకు .. ఫంక్షన్లకు దూరంగా ఉంటాను. నాకు బాగా పరిచయ మైన వారితోనే చనువుగా ఉంటాను. నలుగురిలోకి చొచ్చుకుపోయే స్వభావం నాలో చిన్ననాటి నుంచి లేదు. ఇప్పటకీ అలవాటు కాలేదు. అందువల్ల నేను ఇండస్ట్రీలో ఇమడలేనని నా ఫ్రెండ్స్ అనేవారు. కానీ అలా ఉంటూనే ఇంతవరకూ వచ్చాను' అని తెలిపింది.

## కళాత్మక చిత్రాల దర్శకుడు భన్సాలీతో నయనతార!

సౌతిండియా సూపర్ స్టార్ గా గుర్తింపు పొందిన నయనతార ఇటీవలే బాలీవుడ్ లో 'జవాన్' చిత్రంలో నటించిన సంగతి తెలిసిందే. కెరీర్ ఆరంగేట్రమే 1000 కోట్ల క్లబ్ సినిమాలో నటించి సత్తా చాటింది. ఈ చిత్రంలో నయన్ పోలీసాఫీసర్ పాత్రలో కనిపించింది. పోరాట సన్నివేశాల్లో మెప్పించింది. ఇప్పుడు హిందీ చిత్రసీమలో మరో క్రేజీ ప్రాజెక్టుకి నయన్ సంతకం చేయనుందని తెలిసింది. ప్రముఖ జాతీయ మీడియా కథనం ప్రకారం.. నయనతార తదుపరి దేశం దృష్టిని తనవైపునకు తిప్పుకునే స్థాయి ఉన్న కళాత్మక చిత్రంలో నటించే అవకాశం ఉంది. బాలీవుడ్‌లో తన రెండో సినిమా కోసం ఇప్పటికే చర్చలు జరుపుతున్నట్లు తెలుస్తోంది. కళాత్మక చిత్రాల దర్శకుడు సంజయ్ లీలా భన్సాలీ తెరకెక్కించనున్న మ్యూజికల్ పీరియడ్ డ్రామా 'బైజు బావ్రా'లో నయన్ కీలక పాత్ర పోషించే అవకాశం ఉ ఒదనేది తాజా సమాచారం. బాలీవుడ్ స్టార్ రణవీర్ సింగ్ టైటిల్ రోల్ బైజు బావ్రాగా నటించనుండగా, ఈ మ్యూజికల్ పీరియడ్ డ్రామాలో జాతీయ అవార్డు గ్రహీత అలియా భట్ కథానాయికగా నటించనుంది. ఆలియా పాత్రకు ధీటుగా ఆకర్షించే ఓ కీలక పాత్ర



కోసం నయన్ ని సంప్రదించారనేది గుసగుస. రణవీర్-అలియా జంటగా నటించే ఈ చిత్రంలో నయన్ పాత్ర ఎలా ఉంటుంది? అన్నదానిపై ఎలాంటి అప్ డేట్ లేదు. బైజు బావ్రా దర్శకనిర్మాతలు ఇప్పటికే నయన్ ని సంప్రదించారని మాత్రమే తెలుసు. ఇరువైపులా ప్రస్తుతం నిబంధనలు షరతులపై ఆలోచిస్తున్నారు. నయనతార - విఘ్నేష్ శివన్ 2023 మార్చిలో సంజయ్ లీలా భన్సాలీని కలిసి ఒక సినిమా కోసం చర్చించారని కథనాలొచ్చాయి. అది బైజు బావ్రా కోసమేనని ఇప్పుడు అర్థమవుతోంది. తాజా పరిణామంతో రణవీర్ సింగ్ - అలియా భట్‌లతో పాటు బైజు బావ్రా లో నయన్ నటించేందుకు మెజారిటీ అవకాశాలున్నాయని భావించాలి. బైజు బావ్రా కథాంశం కాలాదులు ఆసక్తికరం. 1950ల నాటి హిందుస్థానీ శాస్త్రీయ సంగీత కళాకారుని నిజ జీవితంపై సినిమా ఇది. ఇందులో రణవీర్ సింగ్ టైటిల్ రోల్‌లో నటిస్తారు. సంజయ్ లీలా భన్సాలీతో రణవీర్ కి ఇది నాలుగో సినిమా. గల్లీ బాయ్ -రాకీ ఔర్ రాణి కి ప్రేమ్ కహానీ తర్వాత అలియా భట్ ఈ చిత్రంలో కథానాయికగా నటిస్తోంది. దీంతో ఈ జంట మూడోసారి కలిసి స్క్రీన్ షేర్ చేసుకుంది. ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఈ ప్రాజెక్ట్ 2024 ప్రథమార్థంలో సెట్స్ పైకి వెళ్లే అవకాశం ఉంది.



# కాంగ్రెస్ పాలన బాగుంటే.. తెదేపా పుట్టేదా?

మానకొండూరు: కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఇందిరమ్మ రాజ్యం తీసుకొస్తామని ఆ పార్టీ నేతలు చెబుతున్నారని.. ఆమె పరిపాలనే బాగుండుంటే ఎన్టీఆర్ తెదేపాను ఎందుకు పెడతారని సీఎం కేసీఆర్ ప్రశ్నించారు. ఎన్టీఆర్ పార్టీ పెట్టి రూ.2లకే కిలో బియ్యం ఇచ్చాకే పేదల కడుపు నిండిందని అన్నారు. కరీంనగర్ జిల్లా మానకొండూరులో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభలో ఆయన మాట్లాడారు. పత్తికాయలు పగిలినట్లు రైతుల గుండెలు పగిలిపోయింది కాంగ్రెస్ హయాంలోనేనని ఈ సందర్భంగా కేసీఆర్ విమర్శించారు. "ఉన్న తెలంగాణను ఆంధ్రాలో కలిపింది కాంగ్రెస్ పార్టీ. దానికోసం 58 ఏళ్లు పోరాటం చేయాల్సి వచ్చింది.

తెలంగాణ ఉద్యమంలో ప్రజలను పిట్టలను కాల్చినట్లు కాల్చిపడేశారు. మలి దశ ఉద్యమంలో భారాస భాగమైంది. తెలంగాణ ఇస్తామంటే కాంగ్రెస్‌తో పొత్తుపెట్టుకున్నాం. అయినా తెలంగాణ రాకపోయేసరికి ఉద్యమాలను మరింత ఉద్ధృతం చేశాం. ఆ ఉద్యమంలో రసమయి బాలకిషన్‌లాంటి వాళ్లు భాగమై ధూంధాం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. అనేక పోరాటాల తర్వాత కేంద్రం నుంచి ఒక ప్రకటన వచ్చింది. ఆ తరువాత కూడా తెలంగాణ ఇవ్వడానికి వారికి మనసు రాలేదు. సకలజనుల సమ్మె అంటూ మళ్లీ ఉద్యమం చేస్తే గానీ తెలంగాణ సాకారం కాలేదు. భారాస హయాంలో ఎన్నో పథకాలు ప్రవేశపెట్టాం. వృద్ధులు, వికలాంగులను దృష్టిలో పెట్టుకొని పింఛన్లను పెంచుకుంటూ పోయాం.

హోంగార్డులకు అత్యధిక వేతనం ఇస్తున్నాం. సాగునీటి పథకాల కారణంగా పొలాలు కళకళలాడుతున్నాయి. ఎక్కడ చూసినా ధాన్యపు రాశులే కనిపిస్తున్నాయి. కరీంనగర్‌కు మీకు ఏదో లింకు ఉంది అని ఇటీవల మా కరీంనగర్ భీముడు గంగుల కమలాకర్ అన్నారు. పెళ్లి ఇక్కడే చేసుకున్న కాబట్టి లింకు ఉంది అన్నాను. అయితే.. ఇక్కడికి వచ్చిన ప్రతిసారి ఏదో ఒక కొత్త పథకం ప్రకటిస్తున్నాను. అందుకే మళ్లీ భారాసకు అధికారం ఇస్తే ఆటోలకు ఫిట్‌నెస్ ఛార్జీ, సర్టిఫికెట్‌లకు అయ్యే ఖర్చును రద్దు చేస్తామని ఈ సందర్భంగా ప్రకటిస్తున్నా. దీంతో ఎంతోమంది ఆటో డ్రైవర్లకు లబ్ధి చేకూరుతుంది" అని కేసీఆర్ అన్నారు.



# కాంగ్రెస్‌వి ఫేక్ గ్యారంటీలు..

## వాటిని ప్రజలు నమ్మడం లేదు: కిషన్‌రెడ్డి

హైదరాబాద్: అధికారంలోకి రావడానికి కాంగ్రెస్ పార్టీ ఆచరణ సాధ్యం కాని హామీలు ఇస్తోందని కేంద్రమంత్రి, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి విమర్శించారు. భారతీయ జనతా పార్టీకి అన్ని వర్గాల నుంచి ఆదరణ లభిస్తోందని చెప్పారు. బడుగు బలహీన వర్గాలు, షెడ్యూల్ తెగల ప్రజలు భాజపాను విశేషంగా ఆదరిస్తున్నారన్నారు. నాంపల్లిలోని భాజపా రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో కిషన్‌రెడ్డి మాట్లాడారు. "అనేక అసెంబ్లీ నియోజకవర్గాల్లో భాజపా ముందంజలో ఉంది. ఒక నిశబ్ద విప్లవం తరహాలో భారాసకు వ్యతిరేకంగా ఓటేయాలని ప్రజలు చూస్తున్నారు. భారాస ఎమ్మెల్యేలు, ప్రచార రథాలను గ్రామాల్లోకి రానివ్వకుండా ప్రజలే అడ్డగిస్తున్న పరిస్థితి నెలకొంది. దళితబంధు, రుణమాఫీ, బీసీ బంధు, దళిత ముఖ్యమంత్రి హామీలు నెరవేర్చలేదని ధైర్యంగా ప్రశ్నిస్తున్నారు. ఇన్నాళ్లు పోలీసులకు భయపడిన వారు కేసీఆర్ ప్రభుత్వం దిగిపోవడం ఖాయమని నిర్ధారించుకొని ముందుకొస్తున్నారు. కొన్ని సర్వే సంస్థలు దొంగ లీకేజీలు ఇస్తున్నా భాజపా అభ్యర్థులకు ఆదరణ తగ్గడం లేదు. భాజపా మేనిఫెస్టో పట్ల ప్రజలు సానుకూలంగా స్పందిస్తున్నారు.

బీసీ ముఖ్యమంత్రి హామీ వారిని ఆకర్షించింది. యువత నరేంద్రమోదీకి అండగా నిలబడుతున్నారు. భారాస, కాంగ్రెస్ కుటుంబాల నుంచి వచ్చినవారు సైతం భాజపాకు మద్దతిస్తున్నారు. ఏదైనా ఒక మాట చెబితే ఆ మాట మీద నిలబడే పార్టీ భాజపా అని అంతా భావిస్తున్నారు. మిగతా పార్టీల నేతలు మాట్లాడే మాటలు కోటలు దాటుతాయి.. కానీ వారు చేసే పనులు ప్రగతి భవన్, గాంధీభవన్ కూడా దాటవు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచీ కాంగ్రెస్ అనేక గ్యారంటీలు ఇచ్చింది. ఈ దేశ, రాష్ట్ర ప్రజలకు ఆ పార్టీ విషాదమే మిగిల్చింది. కాంగ్రెస్ కారణంగా తెలంగాణ అనేక రకాలు నష్టపోయింది. తొలి విడత ఉద్యమంలో 365 మందిని, మలి విడతలో 1200 మంది విద్యార్థులను బలితీసుకుంది. ఆ పార్టీ ప్రస్తుతం ఇస్తున్న ఫేక్ గ్యారంటీలను ప్రజలు నమ్మే పరిస్థితి లేదు" అని కిషన్‌రెడ్డి అన్నారు.



# పదేళ్లలో చేసిందేంటో చెప్పకుండా.. కాంగ్రెస్‌పై విమర్శలా?

నర్సాపూర్: సీఎం కేసీఆర్ పాలనలో రైతుల ఆత్మహత్యలు, నిరుద్యోగంలో తెలంగాణ అగ్రస్థానంలో ఉందని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి ఆరోపించారు. ఈ పదేళ్లలో తెలంగాణ ప్రజలకు భారాస చేసిందేమిటో చెప్పకుండా కాంగ్రెస్‌పై విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. ప్రత్యేక రాష్ట్రం వచ్చాక కేసీఆర్ కుటుంబం మాత్రమే బాగుపడిందని విమర్శించారు. మెదక్ జిల్లా నర్సాపూర్‌లో జరిగిన కాంగ్రెస్ బహిరంగ సభలో రేవంత్ మాట్లాడారు. ఇచ్చిన హామీలను సీఎం కేసీఆర్ నెరవేర్చలేదన్నారు.

ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే మహాలక్ష్మి పథకం కింద మహిళలకు నెలకు రూ.2,500 ఇస్తామని హామీ ఇచ్చారు. రూ.500కే గ్యాస్ సిలిండర్‌తో పాటు ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తామని రేవంత్ వెల్లడించారు.



# హైదరాబాద్ సీపీ శాండిల్యకు అస్వస్థత

హైదరాబాద్: హైదరాబాద్ నగర పోలీసు కమిషనర్ (సీపీ) సందీప్ శాండిల్య అస్వస్థతకు గురయ్యారు.

బషీర్‌బాగ్ పాత సీపీ కార్యాలయంలో ఉండగా సందీప్ శాండిల్య ఛాతీనొప్పితో ఇబ్బంది పడ్డారు. దీంతో ఆయనను అధికారులు హుటాహుటిన హైదర్‌గూడలోని అపోలో ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం శాండిల్య ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉందని వైద్యులు తెలిపారు. ఆస్పత్రిలో సందీప్ శాండిల్యను సీఐడీ చీఫ్ మహేశ్ భగవత్ పరామర్శించారు.

# తెలంగాణ ఇచ్చారని నాడు సోనియాను పొగిడిన కేసీఆర్.. నేడు తిడుతున్నారు



ఖమ్మం : కేసీఆర్ పది సంవత్సరాలుగా ముఖ్యమంత్రిగా ఉండి రెండు చోట్ల ఎందుకు పోటీ చేస్తున్నాడని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత వి. హనుమంతరావు ప్రశ్నించారు. తిరుమలాయపాలెం మండలం ఎలువారిగూడెం పాలేరు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి శ్రీనివాస్ రెడ్డి ఎన్నికల ప్రచారంలో భాగంగా వీహెచ్ మాట్లాడుతూ.. కేసీఆర్ తెలంగాణని బ్రాందీ షాపుల్లో నంబర్ వన్ చేశాడన్నారు. తెలంగాణ రాష్ట్రం కోసం పార్లమెంట్‌లో కొట్లాడింది తామని.. తెలంగాణ ఇచ్చింది సోనియా గాంధీ అని పేర్కొన్నారు. తెలంగాణ వస్తే దళితుణ్ణి ముఖ్యమంత్రి చేస్తానంటే నమ్మారన్నారు. ఆనాడు సోనియాగాంధీని పొగిడిన కేసీఆర్ ఈనాడు ఆమెను తిడుతున్నాడని వీహెచ్ అన్నారు. రాహుల్ గాంధీ తిరుగుతుంటే ఎందుకు వస్తున్నాడని అడుగుతున్నారని.. మీరెందుకు మహారాష్ట్ర పోయారని ప్రశ్నించారు. అన్నం పెట్టే రైతన్నకు ఖమ్మంలో కేసీఆర్ సంకెళ్లు వేయించాడన్నారు. అందుకే కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావాలన్నారు. మీరందరూ హస్తం గుర్తుపై ఓటేసి కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని వీహెచ్ అన్నారు.

# కేసీఆర్‌కు మళ్లీ అధికారిమిస్తే అంతే సంగతులు



కరీంనగర్: సీఎం కేసీఆర్, మంత్రి గంగుల కమలాకర్‌పై బీజేపీ నేత బండి సంజయ్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. "వాళ్లది కబ్జాల ఆరా టం....నాది పేదల పోరాటం. ఎటువైపు ఉంటారో మీరే తేల్చుకోండి" అని అన్నారు. సోమవారం మీడియాతో మాట్లాడుతూ.. అబద్ధాలు, మోసాలు, భూకబ్జాల్లో గంగుల కమలాకర్ నెంబర్ వన్ అని ఆరోపిం చారు. బియ్యం టెండర్లలో గంగుల రూ.1300 కోట్ల గోల్ మాల్ చే శారని ఆరోపించారు.

కేసీఆర్ ఇంట్లో ఐదుగురికి పదవులున్నయ్ అని.. నిరుద్యోగులు ఏం పాపం చేశారని ప్రశ్నించారు. ఇంటికో ఉద్యోగం ఏమైందని నిలదీశారు. ఫస్ట్‌కు జీతాలే ఇవ్వలేని కేసీఆర్‌కు మళ్లీ అధికారిమిస్తే అంతే సంగతులు అని బండి సంజయ్ వ్యాఖ్యలు చేశారు.

# ఆ రెండు పార్టీలు ఆకాశం నుంచి చందమామను తెస్తామంటున్నాయ్.. తలసాని



హైదరాబాద్: ఈ నెల 25న పరేడ్ గ్రౌండ్‌లో ముఖ్యమంత్రి కేసీఆర్ సభ జరుగనుంది. ఈ సందర్భంగా సభ ఏర్పాట్లు మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ సోమవారం ఉదయం పరిశీలించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. హైదరాబాద్ సికింద్రాబాద్‌ను ప్రేమించే వాళ్ళు కేసీఆర్ సభకు హాజరై సంఘీభావం తెలపాలన్నారు. తొమ్మిదేళ్ల బీఆర్ఎస్ పాలనలో నగరంలో అనేక అద్భుతమైన ఫలితాలు వచ్చాయన్నారు. సంక్షేమ రంగాల్లో అనేక మార్పులు తెచ్చామని తెలిపారు. ఎలక్షన్‌లు వన్ సైడ్‌గా జరుగుతాయని అన్నారు. హ్యాట్రిక్ సీఎంగా కేసీఆర్ ప్రమాణ స్వీకారం రోజు దగ్గరలోనే ఉందన్నారు. ఢిల్లీ నుంచి గద్దల్లా దిగుతుతున్నారని... ప్రతి పక్షాల కల్లబొల్లి మాటలు నమ్మొద్దని అన్నారు. బీఆర్ఎస్ మేనిఫెస్టోకు భారీ స్పందన వస్తోందన్నారు. ఆకాశం నుంచి చందమామను తెస్తామని బీజేపీ, కాంగ్రెస్‌లు అంటున్నాయని ఎద్దేవా చేశారు. ఢిల్లీ నుంచి వచ్చే వారి మాటలు నమ్మొద్దని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు.

# ముఖ్యమంత్రి కేసీఆర్ నోట పదే పదే ఎన్టీఆర్ నామం




కరీంనగర్: ముఖ్యమంత్రి కేసీఆర్ ఎన్నికల ప్రచారంలో దూసుకుపోతున్నారు. ప్రతి నియోజకవర్గంలో ప్రజా ఆశీర్వాద సభల్లో పాల్గొంటూ బీఆర్ఎస్‌కు ఓటు వేయాలని కోరుతున్నారు. నేడు (సోమవారం) మానకొండూరులో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభలో సీఎం పాల్గొని ప్రసంగించారు. మనకొండూరు సభలో సీఎం కేసీఆర్ పదేపదే ఎన్టీఆర్ పేరును ఉచ్చరించారు. ఇందిరమ్మ రాజ్యంలో అన్నమే లేదని, ఎన్‌టీ రామారావు పార్టీ పెట్టిందే పేదోళ్లకు అన్నం పెట్టడానికి అని కేసీఆర్ చెప్పుకొచ్చారు. ఎన్టీఆర్ వచ్చాకే పేదోడికి కడుపు నిండా అన్నం దొరికిందన్నారు. ఇందిరమ్మ రాజ్యంలో సక్కదనం లేదు కాబట్టే ఎన్టీఆర్ పార్టీ పెట్టారని తెలిపారు. ఎన్టీఆర్ తెచ్చిన రెండు రూపాయలకు కిలో బియ్యం గొప్ప పథకం అని కొనియాడారు. ఇందిరమ్మ రాజ్యంలో పేదోడు జైలు పాలు అయ్యారన్నారు. ఉన్న తెలంగాణను ఆంధ్రాలో కలిపింది కాంగ్రెస్సే అని మండిపడ్డారు. ఇందిరమ్మ రాజ్యం లో ఎమర్జెన్సీ వచ్చిందని ముఖ్యమంత్రి కేసీఆర్ వ్యాఖ్యలు చేశారు.

# కాంగ్రెస్ ఆరు గ్యారంటీలు పేదల జీవితాల్లో వెలుగు తీసుకొస్తాయన్న తుమ్మల



ఖమ్మం : ఖమ్మంలోని 50...51 డివిజన్స్‌లో మాజీ మంత్రి, కాంగ్రెస్ నేత తుమ్మల నాగేశ్వరరావు రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా తుమ్మల మాట్లాడుతూ.. ఖమ్మంలో అరాచకం రాజ్య మేలుతోందన్నారు. భూ కబ్జాలు పోలీస్ అక్రమ కేసులతో జనం విసుగెత్తి పోయారన్నారు. బెదిరించే వారి పేర్లు రాసుకోండి వారి సంగతి చూద్దామని తుమ్మల అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీ పథకాలు పేదల జీవితాల్లో వెలుగులు తీసుకొస్తాయన్నారు.

ఆడబిడ్డల పెళ్లికి లక్ష రూపాయలతో పాటు తులం బంగారం కాంగ్రెస్ హామీ ఇచ్చిందన్నారు. ప్రజాస్వామ్య ఖమ్మం కోసం కాంగ్రెస్ పార్టీనే గెలిపించాలని తుమ్మల పిలుపునిచ్చారు.

# కాంగ్రెస్ ఇచ్చింది ఉచిత కరెంట్ కాదు.. ఉత్తుత్తి కరెంట్.: కేటీఆర్

యాదాద్రి: రాబందుల లెక్క రైతులను పీక్కతిన్నోళ్లు మనకు అవసరమా? అని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు, మంత్రి కేటీఆర్ ప్రశ్నించారు. 55 ఏళ్లలో సాధ్యం కానిది ఈ 9 ఏళ్లలో భారాస చేసి చూపించిందన్నారు. ఆలేరు భారాస అభ్యర్థి గొంగిడి సునీతకు మద్దతుగా యాదగిరిగుట్టలో మంత్రి కేటీఆర్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. డిసెంబర్ 3న గొంగిడి సునీత ఆలేరు ఎమ్మెల్యేగా మూడోసారి గెలవబోతున్నారని ధీమా వ్యక్తం చేశారు. 2014లో యాదగిరిగుట్ట ఎట్లుండే ఇప్పుడు ఎట్లుందో ఆలోచించి ప్రజలు ఓటు వేయాలని కోరారు. "యావత్ ప్రపంచం చర్చించుకునే విధంగా సీఎం కేసీఆర్ యాదగిరిగుట్టను అభివృద్ధి చేశారు. యాదగిరిగుట్ట అభివృద్ధిలో కొందరికి అన్యాయం జరిగింది వాస్తవమే. కొండపైకి ఆటోలు వెళ్లేలా డ్రైవర్లకు డిసెంబర్ 3 తర్వాత శుభవార్త చెబుతాం. కాంగ్రెస్ హయాంలో ప్రజలు కరెంట్ కష్టాలతో ఇబ్బందులు పడ్డారు. కాంగ్రెస్ ఇచ్చింది ఉచిత కరెంట్ కాదు.. ఉత్తుత్తి కరెంట్. వరిధాన్యం పండించడంలో ఇప్పుడు ఉమ్మడి నల్గొండ జిల్లా నంబర్ వన్‌గా ఉంది. తాగు, సాగునీటి కష్టాలు లేవు. డిసెంబర్ 3 తర్వాత కొత్త రేషన్ కార్డులు, కొత్త పింఛన్లు వస్తాయి. అలాగే 4 కొత్త పథకాలు ప్రకటిస్తాం. 18 ఏళ్లు నిండిన ఆడబిడ్డల కోసం 'సౌభాగ్యలక్ష్మి', ఆసరా పెన్షన్‌లను రూ.5 వేలు, వంటగ్యాస్ సిలిండర్‌ను రూ.400కే ఇస్తాం. తెల్లరేషన్ కార్డుదారులకు సన్నబియ్యం ఇవ్వబోతున్నాం. భూమిలేని పేదలకు రూ.5 లక్షల కేసీఆర్ బీమా కల్పిస్తాం. అసైన్డ్ భూములను రెగ్యులరైజ్ చేయడంతో పాటు సమ్మక్క సారక్క పేర్లపై మహిళా సంఘాలు ఏర్పాటు చేస్తాం. గొంగిడి సునీతను మళ్లీ గెలిపిస్తే మాదాపూర్, రఘునాథపురాలను మండలాలుగా ప్రకటిస్తాం. ఆలేరును రెవెన్యూ డివిజన్‌గా ప్రకటిస్తాం. యాదాద్రి కొండపైకి ఆటోలను అనుమతిస్తాం. దాతరుపల్లి వద్ద టూరిజం పార్కుతోపాటు పారిశ్రామిక కారిడార్ తీసుకువస్తాం" అని కేటీఆర్ హామీ ఇచ్చారు.

# కేసీఆర్ సర్కార్‌కు ఝలక్ ఇచ్చిన ఎన్నికల కమిషన్!

తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికలకు మరికొన్నిరోజులే సమయం ఉంది. దీంతో అధికార, ప్రతిపక్ష పార్టీలు ఏ చిన్నపాటి అవకాశం వచ్చినా సరే.. ఓటర్లను తమవైపు తిప్పుకునేందుకు ప్రయత్నాలు గట్టిగానే చేస్తున్నారు.

ఇప్పటికే అధికార బీఆర్ఎస్, ప్రతిపక్ష పార్టీలైన కాంగ్రెస్, బీజేపీలు మేనిఫెస్టో ప్రకటించి ఎన్నికల ప్రచారంలో దూసుకెళ్తున్నాయి. అయితే.. బీఆర్ఎస్ మాత్రం సరిగ్గా ఎన్నికల సమయంలో రైతులు, ఉద్యోగులను ప్రసన్నం చేసుకునేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టింది. **ఇదీ అసలు కథ..** ఈ క్రమంలో రైతుబంధు, ప్రభుత్వ ఉద్యోగుల డీఏలు, రైతు రుణమాఫీలకు అనుమతి ఇవ్వాలని రాష్ట్ర ఎన్నికల కమిషన్‌ను కేసీఆర్ సర్కార్ సంప్రదించింది. అయితే.. ఈ విజ్ఞప్తులను ఎన్నికల కమిషన్ తిరస్కరించింది. పెండింగ్ డీఏలు ఇప్పుడు ఎలా ఇస్తారు..? అని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఈసీ ప్రశ్నించింది. దీంతో కేసీఆర్ సర్కార్‌కు ఈసీ ఝలక్ ఇచ్చినట్లయ్యింది. నిన్న, మొన్నటి వరకూ రైతుబంధు విషయంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య మాటల తూటాలు పేలాయి. రైతన్నలకు రైతుబంధు ఇస్తామంటే.. కాంగ్రెస్ నేతలు ఎన్నికల కమిషన్ ఫిర్యాదు చేశారని బీఆర్ఎస్ పెద్దలు ఆరోపించారు. అంతేకాదు.. కాంగ్రెస్ అడుగడుగునా ఇలా అడ్డంకులు సృష్టిస్తోందని ఒకరిపై ఒకరు కౌంటర్లు ఇచ్చుకున్నారు. ఈ క్రమంలోనే రైతు బంధు ఆపాలని సైతం ఎవరి నుంచి తమకు ఫిర్యాదులు ఇప్పటివరకూ అందలేదని తెలంగాణ ఎన్నికల ప్రధాన అధికారి వికాస్ రాజ్ మీడియాకు వెల్లడించారు. ఇప్పుడు తాజాగా పై విధంగా ఎన్నికల కమిషన్ ప్రకటించింది. ఈసీ ప్రకటనపై బీఆర్ఎస్ నుంచి ఎలాంటి రియాక్షన్ వస్తుందో చూడాలి మరి.

Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com